తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త

## వైభవంగా పౌర్ణమి గరుడసేవ



తిరుమల, జులై 29ప్రభాతవార్తప్రతినిధి: గురుపౌర్ణమివేళ బుధవారం రాత్రి పౌర్ణమి గరుడసేవ అత్యంత వైభవంగా జరిగింది. రాత్రి 7 గంటలకు సర్వాలంకార భూషితుడైన మలయప్ప స్వామి గరుడునిపై ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షి ంచారు. గరుడవా హనం ద్వారా స్వామి వారు దాసానుదాస ప్రపత్తికి తాను దాసుడని తెలియజెబుతారు. ఈ వాహనసేవలో పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి ్మ, భాను ప్రకాష్ రెడ్డి, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ ఇతర ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## గజ వాహనంపై అభయమిచ్చిన అమ్మవారు

తిరుచానూరు, జూలై 29 ప్రభాతవార్త :



తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారు బుధవారం వ్యాస పూర్ణిమ, ఉత్తరాషాడ నక్షత్రం కావడంతో మాడవీధులలో గజ వాహనంపై ఊరేగారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో హరేంద్రనాథ్, ఏ ఈ ఓ దేవ రాజులు, అర్చకులు బాబు స్వామి, సూపర్ ఇండియన్ సురేష్ మరియు విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.



# వేరుసెనగ రైతుకు చుక్కలు

- 21 వేల క్వింటాళ్ళ సబ్సిడీ వేరుసెనగ గల్లంతు
- ఖరీఫ్‌లో కేవలం 6 వేల క్వింటాళ్ళ విత్తనాలు మాత్రమే రైతుకు పంపిణీ
- 9 మండలాల్లోని రైతులకు మాత్రం 6 వేల క్వింటాళ్ళ సబ్సిడీ వేరుసెనగ అందజేత
- సబ్సిడీ వేరుసెనగ ఏమైనట్లు రైతుల నిలదీతలు

చిత్తూరు, జులై 29 ప్రభాతవార్త: ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుండి జిల్లా వ్యవసాయ శాఖ వర్షాధారంగా వేరుసెనగ పంట సాగు చేసే రైతులకు చుక్కలు చూపిస్తోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలల పూర్తయినప్పటికీ వ్యవసాయ శాఖ మాత్రం సబ్సిడీ వేరుసెనగ ఇప్పుడు వస్తుంది! అప్పుడు వస్తుంది! అని రైతులతో దోబుచులాడుకుంటోంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలోని రైతులకు ప్రభుత్వం కేటాయించిన 27,225 క్వింటాళ్ళ సబ్సిడీ వేరుసెనగ విత్తనాలు ఏం అయినట్లు వ్యవసాయ శాఖ అధికారులను రైతులు ప్రస్తుతం నిలదీస్తున్నారు. జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో వర్షాధారంగా మెట్ట ప్రాంతాల్లో రైతులు 54 వేల ఎకరాల విస్తీర్ణం భూమిలో వేరుసెనగ పంట సాగు చేస్తారు. ఖరీఫ్‌లో వేరుసెనగ విత్తాల్సిన రైతులకు 30 కేజీల వేరుసెనగ విత్తనాల బస్తా రూ.1,850కు వ్యవసాయ శాఖ రైతులకు పంపిణీ చేయాల్సి వుంది. అయితే మే నెలాఖరు నుండి వ్యవసాయ శాఖ అధికారులు ఖరీఫ్‌లో వేరుసెనగ సాగు చేసే రైతులతో దోబుచులాడుకుంటున్నారు. జులై నెల మధ్యలో జిల్లాలోని 9 మండలాల పరిధిలోని వేరుసెనగ రైతులకు మాత్రమే 6 వేల క్వింటాళ్ళ సబ్సిడీ వేరుసెనగ విత్తనాలు పంపిణీ చేశారు. సిఎం నారా చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గ వేరుసెనగ రైతులతో పాటు బైరెడ్డిపల్లి, వి.కోట, పలమనేరు, జిడినెల్లూరు నియోజకవర్గ పరిధిలోని ఎస్ఆర్ పురం, వెదురుకుప్పం మండలాల్లోని వేరుసెనగ రైతులకు మాత్రం వ్యవసాయ శాఖ అధికారులు 30 కేజీల వేరుసెనగ బస్తా రూ.1,850కు పంపిణీ చేసి చేతులు దులుపుకున్నారు. ఈ మేరకు ఈ 9 మండలాల్లోని వేరుసెనగ రైతులకు ఈ ఖరీఫ్‌లో 6 వేల క్వింటాళ్ల వేరుసెనగ విత్తనాలు మాత్రం సరఫరా అయ్యాయి. జిల్లాలోని మిగిలిన 19 మండలాల్లోని వేరుసెనగ రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు సబ్సిడీ విత్తనాలు ఇప్పుడు వస్తాయి! అప్పుడు వస్తాయి! అంటూ నాన్చుడు వైఖరీ అవలంబిస్తుండటంతో ఈ సీజన్‌లో ఇప్పటికీ వేరుసెనగ సాగు చేయాలని ఆశలు పెట్టుకున్న రైతులు వ్యవసాయ శాఖ పంపిణీ చేసే సబ్సిడీ వేరుసెనగ విత్తనాల కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. జిల్లాలోని మెజార్టీ మండలాల్లోని రైతులకు ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ శాఖ ద్వారా పంపిణీ అయ్యే సబ్సిడీ వేరుసెనగ విత్తనాలు ఇంకా పంపిణీ చేపట్టకపోవడంతో పంట సాగు చేయడానికి సిద్ధమైన కొంతమంది రైతులు తమిళనాడు రాష్ట్రంలోని కృష్ణగిరి, సేలం, వేలూరు, అర్కాడ్, గుడియాత్తం, పళ్ళిపట్టు తదితర ప్రాంతాలకు వెళ్ళి అక్కడ వున్న రైతుల నుండి వేరుసెనగ విత్తనాలకు ఎక్కువ ధరకు తెచ్చుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ఖరీఫ్ వేరుసెనగ విత్తనాల కేటాయింపు జిల్లాకు ఎంత జరిగింది! ఇందులో ఇప్పటి వరకు రైతులకు ఎంత మొత్తంలో సబ్సిడీ వేరుసెనగ విత్తనాలు పంపిణీ చేశారు. జిల్లాకు కేటాయించిన సబ్సిడీ వేరుసెనగ విత్తనాల్లో సుమారు 20 వేల క్వింటాళ్ళ వేరుసెనగ విత్తనాలు ఏమి అయ్యాయి. చిత్తూరు జిల్లాకు కడప, అనంతపురం జిల్లాల నుండి సబ్సిడీ వేరుసెనగ విత్తనాలు 27 వేల క్వింటాళ్ళ విత్తనాలను చిత్తూరు జిల్లాకు కేటాయించారు. ఇప్పుడు 6 వేల క్వింటాళ్ళ వేరుసెనగ సబ్సిడీ విత్తనాలు మినహాయించి మిగిలిన 21 వేల క్వింటాళ్ళ వేరుసెనగ విత్తనాలు ఏం అయ్యాయని వేరుసెనగ రైతుల సూటి ప్రశ్న. అసలు జిల్లాకు కేటాయించిన విత్తనాలు ప్రక్కదారి ఎమైనా పట్టాయా! లేక నిజంగానే విత్తనాలను ఆయిత్ సీడ్ కంపెనీలు జిల్లాకు సరఫరా చేయలేదా! అనే విషయాలపై జిల్లా వ్యవసాయ అధికారులు క్లారిటీ ఇవ్వాల్సిన అవసరం వుంది.

# కూటమి ప్రభుత్వం కొనసాగాలి

**సిఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి**
**ఎన్నడూలేనిరీతిలో కుప్పం అభివృద్ధి.. ఈ దఫా అత్యధిక మెజార్టీ రావాలి !!**
**ప్రజలు మనతో ఉండేలా నేతలు పనిచేయాలి.. తెదేపాకు కార్యకర్తలే వెన్నముక !!**
**కార్యకర్తలకు బీమా ఘనత లోకేష్‌దే.. వెన్నంటి నిలిచిన మహిళా లోకానికి జోహార్లు !!**



వేపూరు గ్రామంలో మహిళలతో ముఖాముఖి కార్యక్రమంలో ప్రసంగిస్తున్న నారా భువనేశ్వరి

కుప్పం, జూలై 29 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడును విశ్వసించి ప్రజలు ఓట్లేసి గెలిపించిన కూటమి ప్రభుత్వం మరలా కొనసాగాలని ఇందుకు ప్రజలు కూడా మేమున్నాం మీకోసం అంటూ చేయి కలపాలని సిఎం చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. బుధవారం కుప్పం మండలంలోని వసనాడు, వేపూరు, గరిగచీనేపల్లి గ్రామాల్లో ఆమె పర్యటించి మహిళలతో ముఖాముఖి నిర్వహించారు. గతంలో ఎన్నడూలేని రీతిలో కుప్పం అభివృద్ధి చెందుతో ందన్నారు. నలభై ఏళ్లుగా సిఎం చంద్రబాబు ఎమ్మెల్యేగా ఇక్కడ పనిచేస్తున్నారని ఈసారి కుప్పంలో సిఎం చంద్రబాబుకు అత్యధిక మెజార్టీ రావాలని పేర్కొన్నారు. సిఎం చంద్రబాబుపై నమ్మకంతో కుప్పానికి ముప్పై పరిశ్రమలు వచ్చాయన్నారు. కుప్పంలో నీటి సమస్య పరిష్కారంకై కృష్ణాజలాలు తెచ్చారన్నారు. పార్టీ నాయకులు కూడా ప్రజలు మనతో ఉండేలా పనిచేయాలని గ్రామాలను అభివృద్ధి చేయించుకునేబాధ్యత నాయకులపై ఉందన్నారు. ఐదేళ్ల వైఎస్సార్సీ పాలనలో ఏం జరిగిందో ప్రజలే చెప్పాలన్నారు. ఐదారుమంది నాయకులు అప్పట్లో తమ పొట్టలు నింపుకున్నారని వారి కుటుంబాల్ని పట్టించుకోలేదన్నారు. సిఎం చంద్రబాబునాయుడు పనిచేసేది ప్రజలకోసమేనన్నారు.

### తెదేపాకు కార్యకర్తలే వెన్నముక

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే వెన్నముక అని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. పెద్ద నాయకులు పార్టీలో ఉండడం వెళ్లడం చూస్తుంటామని అయితే కార్యకర్తలు తెదేపా జెండా పైనే ఉండాలని మోసి తీసుకెళ్తున్నారన్నారు.అది తెదేపా కార్యకర్తల గొప్పతనం అన్నారు. ఇలాంటి కార్యకర్తలు ఏ పార్టీకి లేరన్నారు. కార్యకర్తలను తమ కుటుంబం మరువదని పేర్కొన్నారు. వైఎస్సార్సీ పాలనలో ఎంతోమంది తమ జీవితాలు త్యాగాలు చేశారన్నారు. పార్టీ కార్యకర్తలకు భీమా సౌకర్యం కల్పించిన ఘనత మంత్రి నారా లోకేష్‌కే దక్కుతుందన్నారు. సిఎం చంద్రబాబు 57రోజులు అక్రమ నిర్బంధంలో ఉన్న సమయంలో ఉద్యమంలా పోరాడి తన వెన్నంటి నిలిచిన మహిళలకు జోహార్లు అని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, సిఎం పిఎ శ్రీకాంత్, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, క్లస్టర్ ఇన్‌చార్జ్ హైదర్ వలీ, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, రెస్కో ఛైర్మన్ ప్రతాప్, ఏరియా ఆస్పత్రి వైస్‌ఛైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్, కాణిపాకం బోర్డు సభ్యురాలు వసంతమ్మ, కార్పొరేషన్ డైరెక్టర్ మణి, స్థానిక నేతలు లీలా వెంకటేష్, చలపతి, మంజు తదితరులు పాల్గొన్నారు.

### క్రాఫ్ట్ విలేజ్ ప్రాజెక్టు పనులను

# యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయండి

### జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్



తిరుపతి కలెక్టరేట్, జూలై 29: ప్రభాతవార్త :

క్రాఫ్ట్ విలేజ్ ప్రాజెక్టు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ ఛాంబర్ లో క్రాఫ్ట్ విలేజ్ పై జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం, డీఆర్‌డీఏ సమన్వయంతో మొత్తం 3 ఎంపోరియం బ్లాక్‌లు, 3 వర్క్ షెడ్లు , మరుగుదొడ్డి సౌకర్యంతో కూడిన 1 శిక్షణ తరగతి గది నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఈ నిర్మాణ పనులను రోడ్లు మరియు భవనాల శాఖ టెండర్ విధానంలో చేపట్టిందని తెలిపారు. మొత్తం 3 ఎంపోరియం బ్లాక్ లు, శిక్షణ తరగతి గది నిర్మాణం కూడా పూర్తయిందన్నారు. 3 వర్క్ షెడ్లలో 1 వర్క్ షెడ్ నిర్మాణం పూర్తికాగా, మిగిలిన 2 వర్క్ షెడ్ల నిర్మాణ పనులు పాక్షి కంగా పూర్తయ్యాయన్నారు. పెండింగ్ లో ఉన్న పనులను సంబంధిత శాఖలు సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆర్ అండ్ బి, డిఆర్డిఏ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో తిరుపతి, చిత్తూరు డిఆర్డిఏ పిడి లు శోభన్ బాబు, శ్రీదేవి, ఏడి హ్యాండి క్రాఫ్ట్ సత్యమూర్తి, ఆర్‌అండ్‌బి ఈఈ రాజా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా అమ్మణ్ణికి కలిశాభిషేకం

సూళ్లూరుపేట, జూలై 29 ప్రభాతవార్త





గురు పూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ చెంగాళమాత పరమేశ్వరి దేవికి బుధవారం కన్నుల పండువగా కలిసాభిషేకాన్ని బుధ వారం నిర్వహించారు. మూడు రోజులుగా 108 కలిశాలలో జలాలను నింపి అమ్మని సన్నిధిలో ఉంచి ప్రత్యేక పూజలు చేసిన పవిత్ర జలాలను చేసిన జలాలను అమ్మని ఉత్సవ విగ్రహానికి అభిషేకాన్ని చేశారు. ప్రముఖ పారిశ్రామిక యొక్క కొండేపాటి గంగా ప్రసాద్,కోమలి దంపతులు, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, శ్రీ పెంచలకోన మాజీ ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ తానంకి నానాజీ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి తదితరులు కలిశాలను శిరస్సుపై ఉంచుకొని భక్తి శ్రద్ధతో అమ్మణ్ణి ప్రార్థిస్తూ ఉత్సవ విగ్రహానికి పవిత్ర జలాలతో కలిశాభిషేకాన్ని భక్తుల శ్రీ చెంగాళమ్మ నామ స్మరణల మధ్య చేశారు. దేవస్థాన సహాయ కమిషనర్ బి ప్రసన్నలక్ష్మి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

# కాణిపాకంలో వైభవంగా శాకాంబరి అలంకారం

**15 టన్నుల కూరగాయలు, పండ్లు వినియోగం-కిక్కిరిసిన భక్తజనం**



కాణిపాకం, జూలై 29 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం ఆషాడ పౌర్ణమి సందర్భంగా బుధవారం శాకాంబరి అలంకారంను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు.కాణిపాకంలో 2022 నుండి ఆషాడపౌర్ణమి సందర్భంగా శాకాంబరి అలంకారంను దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమరగదాంభిగా సమేత మణికంఠేశ్వరాలయంలో నిర్వహిస్తున్నారు. ఈఏడాది మణికంఠేశ్వరాలయంతో పాటు



ప్రధాన ఆలయంలో శాకాంబరి అలంకారంను ఘనంగా నిర్వహించారు. ఈమేరకు ప్రధాన ఆలయంలోని అంత్రాలయం, అర్ధమండపం, బంగారు ధ్వజస్థంభంలను వివిధ రకాల కూరగాయలు పండ్లుతో అలంకరించారు అలాగే మణికంఠేశ్వరాలయంలోని శ్రీమరగదాంభిగా దేవి, దుర్గాదేవి అమ్మవార్లతో పాటు ఆలయ మండపాలను వివిధరకాల కూరగాయలు, పండ్లుతో శాకాంబరి అలంకారంను నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్, ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ధనపాల్, సూపరెండెంట్‌లు వాసు, కోదండపాణి, ఆలయ పాలకమండలి సభ్యులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

# ఏకం క్షేత్రంలో వైభవంగా గురుపూర్ణిమ వేడుకలు

**- 70000 వేల మంది కోసం ప్రత్యేకమైన దర్శనం**





వరదయ్యపాలెం, జూలై 29 ప్రభాతవార్త

ఏకం క్షేత్రం, పవిత్ర గురు పూర్ణిమ సందర్భంగా రోజంతా ముక్తిగురు దర్శనాన్ని అందించింది. సుమారు 70,000 మంది వచ్చారు. ప్రతి ఒక్కరూ ముక్తి గురు శ్రీకృష్ణాజీ ముందు ఒక క్షణం నిలబడాలని, ఆయన చూపుతో లభించే ఇచ్చా సిద్ధి ఆశీర్వాదాల కోసం ఎదురుచూశారు. జార్ఖండ్, బీహార్, మహా రాష్ట్ర వంటి సుదూర ప్రాంతాల నుండి ప్రత్యేక రైళ్ల వచ్చాయి. తమ ప్రయాణ సమయాన్ని ఆరాధనగా మలచుకుని, యాత్ర పొడవునా మంత్రాలు జపించారు. కర్ణాటక, తమిళనాడు నుండి బస్సులు, ప్రైవేట్ వాహనాల నిరంతర తాకిడి కొనసాగింది. పేద, ధనిక అనే తేడా లేకుండా అందరూ ఉచితంగా దర్శనానికి తరలివచ్చారు.

### మంత్రోచ్ఛారణలతో భజనలతో మారుమ్రోగిన ఏకం

నిరంతరంగా జరుగుతున్న హోమ యజ్ఞంలో భాగంగా పవిత్ర అగ్ని ఎప్పటికప్పుడు ప్రజ్వరిల్లుతూనే ఉంది, వేద మంత్రాలు, భజనలు జనసందడి మధ్య పవిత్ర వాతావరణం ఏర్ప డింది. జన్మ రాశి దేవతలకు అంకితమైన, నీటి పాయలతో నిండిన నిశ్శబ్ద ఉద్యానవన మార్గమైన రాశి వనంలో, సందర్శకులు పురాతన వృక్షాల నీడలో నిలిచి రాశి దోష నివారణ కోసం, తమ జన్మ నక్షత్రాలకు సంబంధించిన దేవతల రక్షణ కోరుతూ ప్రార్థించారు. చెన్నై, ఢిల్లీ నుండి కీర్తన బృందాలు, త్రయంబకేశ్వర్ శివాలయం నుండి ప్రయాణించి వచ్చిన నాసిక్ ఢోల్ వాద్యకారుల బృందం వారి తాళాలు, జయకారాలు రోజంతా అలలుగా ప్రాంగణం అంతటా ప్రతిధ్వనించాయి. సమీప గ్రామస్తులు కూడా పండరీ భజనం, కోలాటం వంటి తమ సొంత ప్రదర్శనలతో పాల్గొని, కార్యక్రమానికి ప్రత్యేకమైన స్థానిక సొబగును అద్దారు. మొత్తం జనసమూహం కోసం టెంట్లు, తాగునీరు, ఆహారం ఏర్పాటు చేశారు, వీటిని రోజంతా షిఫ్టుల్లో పనిచేసిన స్వచ్ఛంద సేవా బృందాలు నిర్వహించాయి. ఐశ్వర్య హాస్పిటల్, ఎంజిఎం హాస్పిటల్, రాజలక్ష్మి హాస్పిటల్ నుండి వచ్చిన బృందాలు వైద్య సేవలు అందించగా, విహెచ్‌పి, సంస్కృతి విద్యా పీఠం, సమరసత ఫౌండేషన్ నుండి వాలంటీర్లు సేవా కార్యక్రమాన్ని పూర్తి చేశారు. గురు ఆశీర్వాదం స్వీకరించేందుకు పలువురు ప్రముఖులు కూడా హాజరయ్యారు. ఈ దర్శన కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు జడ్జి లక్ష్మణ రావు, నెల్లూరు జిల్లా జడ్జి శ్రీనివాస్, కృష్ణ జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి శ్రీనివాస రావు, సత్యవేడు నియోజకవర్గ టిడిపి ప్రోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ చక్రవర్తి, శ్రీ కాళహస్తీశ్వరస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ కొట్టె సాయి ప్రసాద్, తిరుపతి జిల్లా బీజేపీ అధ్యక్షులు శ్రీ సామంచి శ్రీనివాస్, కదూరు పిఏసిఎస్ ఛైర్మన్ ఆణిముత్యం నందాకిషోర్, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ మాజీ డోరేటర్ బొప్పన తిలక్ బాను, తెలుగుదేశం పార్టీ వరదయ్యపాలెం మండలం అధ్యక్షుడు పిన్నమనేని యుగంధర్ రెడ్డి, టిడిపి క్లస్టర్ ఇన్చార్జ్ పి. నిర్మల్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# తిరుపతిలో స్మార్ట్ ట్రాఫిక్ సిగ్నలింగ్‌కు శ్రీకారం

**రూ.2.5 కోట్లతో 11 ప్రధాన కూడళ్లలో ఆధునిక వ్యవస్థ ప్రారంభం..**



తిరుపతి విద్య జూలై 29 ప్రభాత వార్త

నగరంలో ట్రాఫిక్ నియంత్రణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద రూ.2.5 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆధునిక ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు బుధవారం ఎం.ఎస్. సుబ్బలక్ష్మి ్మ కూడలిలో ప్రారంభించారు. ఈ వ్యవస్థతో నగరంలోని 11 ప్రధాన కూడళ్లలో స్మార్ట్ ట్రాఫిక్ సిగ్నళ్లు అందుబాటులోకి వచ్చాయి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెరుగుతున్న వాహన రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్ నిర్వహణను క్రమబద్ధీకరించేందుకు ఈ సిగ్నలింగ్ వ్యవస్థ దోహదపడుతుందన్నారు. ద్విచక్ర వాహనదారులు, ఆటో, టాక్సీ డ్రైవర్లు ట్రాఫిక్ సిగ్నళ్లను తప్పనిసరిగా పాటించి ప్రమాదాలను నివారించాలని సూచించారు.స్మార్ట్ సిటీ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు ఈ సిగ్నలింగ్ వ్యవస్థ అనుసంధానమై ఉంటుందని, ఎవరైనా సిగ్నల్ జంప్ చేస్తే ఆటోమేటిక్‌గా ఈచలాన్లు జారీ అవుతాయని ఎమ్మెల్యే హెచ్చరించారు. ప్రజలంతా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.కార్యక్రమంలో డీఎస్పీలు కొండయ్య, భక్తవత్సలం, కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ శ్యాంసుందర్, ఈఈలు తులసి, గోమతి, టీడీపీ ఇన్‌చార్జి జేబీ శ్రీనివాస్, గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, మాజీ డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, జనసేన నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, ఆళ్వార్ మురళి, చింతంశెట్టి మధు తదితరులు పాల్గొన్నారు.

### సిఎం వద్దకు చేరిన

# వ్యాసాశ్రమం పంచాయతీ

### పరిస్థితిని వివరించిన కోలా ఆనంద్

శ్రీకాళహస్తి,జూలై 29 ప్రభాతవార్త

ఏర్పేడు మండల కేంద్రంలోని వ్యాసాశ్రమం వివాదాల పంచాయతీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు వద్దకు చేరింది. తిరుపతిజిల్లాలో సుమారు వంద సంవత్సరాల చరిత్ర కల్గిన వ్యాసాశ్రమంలో ఇటీవల చోటు చేసుకున్న సంఘటనలు,రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ఆశ్రమాలకు చెందిన సాధువులను ఆహ్వానించికనీసం కూర్చొటానికి కుర్చీ లేకుండా సాగించిన ఉదంతం, పోలీసుల తీరు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడుతో రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ కలిసినపుడు చర్చకు వచ్చినట్లు తెలిసింది.ఈ సందర్భంగా ఆశ్రమంకు సంబంధించిన వివాదాలపై ముఖ్యమంత్రి సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. గత రెండు నెలలుగా 'ఆశ్రమ పరిరక్షణ సమితి, పూర్వ విద్యార్థులు ఆశ్రమంలో జరుగుతున్న అక్రమాలకు సంబంధజంచి' రాష్ట్ర పతి స్థాయి వరకు వినతి పత్రాలు ఇచ్చిన విషయం విదితమే.ఆశ్రమంలో ఆధ్యాత్మికతకు బదులు కుటుంబపాలనగా మారిందని, అలాగే కన్యాగురుకులంలో ఆడ బిడ్డలకు కార్యదర్శి అమర్‌నాథ్‌రెడ్డి వల్ల రక్షణ లేకుండా పోయిందని పిర్యాదులు చోటు చేసుకున్నాయి.

### కమిటి ఏర్పాటుపై చర్చ:

రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు శ్రీకాళహస్తి నియోజకవర్గ బిజెపి ఇన్‌చార్జి కోలా ఆనంద్ బుధవారం ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడును కలిసినపుడు వ్యాసాశ్రమం వివాదాలకు సంబంధించి సిఎం వాకబు చేసినట్లు తెలిసింది.ఈ సందర్భంగా కోలా ఆనంద్ పలు అంశాలు సిఎంకు వివరిస్తూ 2006వరకు ఆశ్రమం మహోన్నత ఆశయాలతో నడిచిందన్నారు. 2006లో పరిపూర్ణానందగిరి స్వామి పీఠాధిపతి అయిన తరువాత ఇక్కడ ఆయన సోదరుడు,బంధువుల పెత్తనం పెరిగిందన్నారు. మలయాళ స్వామి ఏర్పాటు చేసిన కమిటికి స్వస్తి చెప్పారు. అంతా తామేగా పరిపాలన మలచుకున్నారు.కమిటికి స్వస్తి పలికారని కోలా ఆనంద్‌వివరించినట్లు సమాచారం. ఇక్కడ కమిటి ఉంటే కొంత అదుపు ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేసారు. ముఖ్యమంత్రి తన పరిధిలో ముందుగానే నివేదికలు తెప్పించుకున్నట్లు సమాచారం.ఈ నేపథ్యంలో 2014 నుంచి ఇక్కడ చోటు చేసుకున్న పరిస్థితి ఇక్కడ కుటుంబపాలనకు సమర్థిస్తున్న నాయకులను గురించి కూడా సిఎం నివేదికలు తెప్పించుకున్నట్లు సమాచారం.



## కనకదుర్గమ్మ సేవలో ఎమ్మెల్యే గురజాల



చిత్తూరురూరల్, జూలై 29 ప్రభాతవార్త: చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ విజయవాడ కనకదుర్గ మ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయం గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంక ట్రావు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తో కలసి దర్శించుకొన్నారు. ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనమండపంలో శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలఉ అందజేసారు.

## శ్రీసాయిబాబా ఆలయంలో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



తవణంపల్లె, జూలై 29 ప్రభాతవార్త: మండలంలోని ఎ.గొల్లపల్లె గ్రామం లో వెలసిన శ్రీషిర్డి సాయిబాబా ఆలయంలో బుధవారం గురుపౌర్ణమి వేడుకలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. ప్రతి ఏటా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు బుధవారం గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఆలయంలో గ్రామస్థులు పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అలాగే పలు రకాల హారతులతో స్వామివారికి ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. అలాగే ఆలయ ప్రాంగణంలో వేదపండితులచే సామూహిక సత్యనారాయణవ్రతంను నిర్వహించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈవ్రతంలో ఎ.గొల్లపల్లె పరిసర గ్రామాలకు చెందిన మహిళలు, భక్తులు పెద్దఎత్తున పాల్గొని వ్రతాన్ని ఆచరించారు. వీరికి ఆలయ నిర్వహకులు స్వామివారి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గురుపౌర్ణమి సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.గురుపౌర్ణమి సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులతో ఆలయ కిటకిటలాడింది.

## అర్ధగిరిలో వైభవంగా ఆషాడ పౌర్ణమి వేడుకలు



తవణంపల్లె, జూలై 29 ప్రభాతవార్త: పముఖ పుణ్యక్షేత్రమైన అరగొండ అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం ఆషాడ పౌర్ణమి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ప్రతి నెలా ఆలయంలో పౌర్ణమి వేడుకలు నిర్వహిస్తుంటారు. ఈమేరకు ఆలయ ఛైర్మన్ రఘుపతి, ఈఓ ఇ.మునిశేఖర్‌ల ఆధ్వర్యంలో ఈవేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో అర్చకులు ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే అర్చకులు ఉదయం 11 గంటలకు ఆలయ మండపంలో సుదర్శనహోమం, ఆకుపూజ, వడమాలసేవ, మధ్యాహ్నం సహస్రనామార్చన, ఆకుపూజ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే రాత్రి స్వామివారికి ప్రాకారోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈమేరకు అలంకరించిన స్వామివారిని ప్రత్యేక పల్లకిపై వుంచి ఆలయం, సంజీవరాయని పుష్కరిని చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఈసందర్భంగా భక్తుల కాలక్షేపం నిమిత్తం పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే భక్తులకు అన్నదానం నిర్వహించడంతో పాటు తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

ఫోటోరైటప్: కెటిఎపి 09, అర్ధగిరిలో పౌర్ణమి సందర్భంగా సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

## అపోలోలో 16 మోకాళ్ళ కీళ్ళమార్పిడి శస్త్రస చికిత్సలు విజయవంతం




తవణంపల్లె, జూలై 29 ప్రభాతవార్త: అపోలో ఆస్పత్రుల ఛైర్మన్ డాక్టర్ ప్రతాప్‌సి.రెడ్డి స్వగ్రామమైన అరగొండలో గ్రామీణ ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన అరగొండ అపోలో ఆస్పత్రి మరో మైలు రాయిని చేరుకుంది. పట్ట ప్రాంతాల్లోని పెద్ద అస్పత్రుల్లో సైతం సాధ్యం కాని విధంగా అరగొండ అపోలో ఆస్పత్రిలో చెన్నై అపోలో ఆస్పత్రికి చెందిన ఆర్థో వైద్య నిపుణులచే అధునాతన పద్దతుల్లో ఒకే రోజు 16 మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్థో వైద్య నిపుణులు డాక్టర్ విజయ కిషోర్‌రెడ్డి, డాక్టర్ కునాల్ పటేల్, ఆస్పత్రి ఏఓ మహేంద్రప్రసాద్‌లు విలేకరులలో మాట్లాడారు. పట్టణ ప్రాంతాలకే పరిమితమైన మోకాళ్ళ కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్సలు అరగొండ అపోలో ఆస్పత్రిలో అతి తక్కువ ఖర్చుతో విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు సుమారు వెయ్యి ఆపరేషన్‌లను వంత శాతం ఫలితాలతో విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. రోగులకు చెన్నై అపోలో ఆస్పత్రి తరహాలో అరగొండ అపోలో ఆస్పత్రిలో కూడా ఆపరేషన్ థియేటర్‌లో నాణ్యమైన ఇంప్లాంట్,ఆధునిక వైద్య సదుపాయాలు, అనుభవజ్ఞులైన ఆర్థోపెడిక్ వైద్యబృందం ద్వారా శస్త్ర చికిత్సలను నిర్వహిస్తున్నట్లు డాక్టర్ విజయ కిషోర్‌రెడ్డి, కునాల్ పటేల్ మహేంద్రప్రసాద్‌లు తెలిపారు. అపోలో ఛైర్మన్ ప్రతాప్‌సి,రెడ్డి దూరదృష్టితో ప్రపంచస్థాయి వైద్యసేవలు, ఆధునిక వైద్యసాంకేతికత, నాణ్యమైన చికిత్సలను అరగొండ అపోలోలో అందిస్తున్నట్లు తెలిపారు. ఈచికిత్సల పట్ల రోగులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈశస్త్ర చికిత్సలు విజయవంతం కావడంలో ఆస్పత్రి జీఎం బాలరాజు, ఏఓ మహే ంద్రప్రసాద్, వైద్యులు, సిబ్బంది బృందం అందించిన సహకారం ఎంతో కీలకమన్నారు.ఇదిలా వుండగా ఆస్పత్రిలో ఈహెచ్ఎస్, ప్రయివేటు ఇన్సూరెన్స్ హెల్త్ స్కీంల ద్వారా ఈశస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. అలాగే అరగొండ అపోలో ఆస్పత్రి గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో ప్రపంచస్థాయి వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో నిరంతరం ముందుకు సాగుతున్నట్లు వారు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆస్పత్రి పీఆర్ఓ కమృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## డికెపల్లి రైల్వే వంతెన సమస్య పరిష్కరించాలి

### - డిసిసి అధ్యక్షుడు రమేష్‌బాబు



కుప్పం, జూలై 29 ప్రభాతవార్త: కుప్పం పట్టణంలో ఉన్న డికెపల్లి రైల్వే వంతెన సమస్యను పరిష్కరించాలని డిసిసి అధ్యక్షుడు రమేష్‌బాబు, కాంగ్రెస్ పార్టీ కుప్పం ఇన్‌చార్జ్ ఆవుల గోపి పేర్కొన్నారు. బుధవారం వారు రైల్వే వంతెనను పరిశీలించారు. తేలిక పాటి వర్షానికే వంతెన కింద నీరు నిల్వ చేరి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారుతోందని స్థానికులు వారికి వివరించారు. అధికారులు ఈ సమస్యను పరిష్కరించలేదన్నారు. ఈసందర్భంగా డిసిసి అధ్యక్షుడు రమేష్‌బాబు మాట్లాడుతూ సమస్యను ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా నేతలు కేశవరాజు, ప్రకాష్, రోహిణప్ప, నిజాం,మునిరామయ్య,గౌహర్,సుందరమూర్తి, ఇర్ఫాన్, సుబ్రమణి, మునస్వామి, నంజప్ప పాల్గొన్నారు.

## కడపల్లి హైస్కూల్‌లో ఎంపిడిఓ తనిఖీ



శాంతిపురం, జూలై 29 ప్రభాతవార్త: మండలంలోని కడపల్లి జడ్పీహైస్కూల్‌లో ఎంపిడిఓ ఎపిఆర్ కుమార్ తనిఖీ చేపట్టారు. ఈసంద ర్భంగా అక్కడి వసతులు, బోధనా పద్ధతులపై ఆరా తీశారు. తల్లికివందనం పథకం ఈ ఏడాది మండలంలో 9478మందికి రూ12.32కోట్లుతల్లులఖాతాల్లో జమైంద న్నారు. అర్హులు ఉంటే, చెల్లింపుల్లో సమస్య ఉంటే స ర్వగ్రామ కార్యాలయంలో ఫిర్యాదు నమోదు చేయాలని కోరారు. పాఠశాలకు ట్యాంకరుతో నీటి సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మహేశ్వరి, ఎఇ మనోజ్ఞ, వివిఎ శశిం ద్ర, విడిఎ భార్గవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యుత్ లో ఓల్టేజ్ నివారణకు చర్యలు

### – రెస్కో డైరెక్టర్ బసవరాజు



శాంతిపురం, జూలై 29ప్రభాతవార్త: సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పం రెస్కో పరిధిలో విద్యుత్ లో ఓల్టేజ్ నివారణకు పాలకవర్గం చర్యలు చేపట్టిందని రెస్కో డైరెక్టర్ బసవరాజు పేర్కొన్నారు. బుధవారం పిల్లిగాని పల్లిలో భాస్కర్ అనే రైతు పొలంలో 25కెవి ట్రాన్స్ ఫార్మర్ ప్రారంభించారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే రెస్కో లక్ష్యమన్నారు. రైతులు విద్యుత్ సమస్యల పరిష్కారంకు 1912 టోల్‌ఫ్రీ నెంబరుకు సమస్య తెలపాలన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ మణి, రెస్కో సిబ్బంది కేశవ, రైతులు చిన్నబ్బయ్య, రామకృష్ణారెడ్డి, బాలాజీ పాల్గొన్నారు.

## శ్రీదశమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న నారా భువనేశ్వరి



కుప్పం, జూలై 29 ప్రభాతవార్త: మండలంలోని బాబునగర్ అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీ దశమేశ్వరి అమ్మవారిని బుధవారం సీఎం చంద్రబాబు సతీమణి ఎన్టీఆర్ ట్రస్ట్ మేనే జింగ్ నారాభువనేశ్వరి దర్శించు కున్నారు. ఈ సందర్భంగా ఆమెకు పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించు కున్న అనంతరం నారా భువనేశ్వరి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గంలో 90 కోట్ల రూపాయలతో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కుప్పం ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం పెంపొందించేందుకు సీఎం చొరవ చూపుతున్నారని పేర్కొన్నారు. గత వైఎస్సార్సీ పాలనలో హిందూ ఆలయాలపై దాడులు చేయడం, విగ్రహాలు పగలగొట్టడం వంటి దురదృష్టకర సంఘటనలు చోటు చేసుకున్నాయన్నారు .ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి స్థలం అందించిన మాజీ సర్పంచ్ కృష్ణమూర్తిని నారా భువనేశ్వరి అభినందించారు. కాగా ఈ ఆలయ ప్రాంగణంలో బసవ తారక కళ్యాణరామ మందిరం ఏర్పాటుకు సహకరించాలని ఆలయ నిర్వాహకులు కోరారు కార్యక్రమంలో కడ ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, పికేఎం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ డాక్టర్ బి.ఆర్ సురేష్ బాబు, సీఎం పిఎ శ్రీకాంత్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారామ్, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్,కార్పొరేషన్‌డైరెక్టర్‌మణి,తెలుగు యువత అధ్యక్షుడు కనకరాజు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి జరిమానా

చిత్తూరు, జులై 29 ప్రభాతవార్త: చిత్తూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్య బాబు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 8 మంది ద్విచక్రవాహనదారులు పటుబడ్డారు. వారిని ట్రాఫిక్ పోలీసులు బుధవారం ఫస్ట్ స్పెషల్ జ్యుడి షియల్, సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో జడ్జి కె.పరిమిళదేవి ఎదుట హాజరు పరిస్తే ఆమె మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఒకొక్కరికి రూ.10 వేలు చొప్పున 80 వేల రూపాయలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు మాట్లాడుతూ మదనయం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే భారీ జరిమానాలు తప్పవని హెచ్చరించారు.

## విస్తృతంగా ఇంటింటికి తెలుగుదేశం

### – జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు షణ్ముగంరెడ్డి



చిత్తూరు, జులై 29 ప్రభాతవార్త: రాష్ట్ర స్థాయిలో తెలుగుదేశం అధిష్టానం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంను చిత్తూరు జిల్లాలో విస్తృతంగా చేపట్టాలని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చెక్కుడుకుప్పం షణ్ముగంరెడ్డి పిలుపునిచ్చారు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు షణ్ముగంరెడ్డి అధ్యక్షతన తెలుగుదేశం నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కిలికిరి మురళీమోహన్‌తో పాటు జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు, వివిధ నియోజకవర్గాల నుండి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సమావేశంలో రెండేళ్ళలో రాష్ట్ర ప్రభుత్వం సాధించిన 'నమ్మకం–అభివృద్ధి–సంక్షేమం' విజయాలను ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్ళాలని జిల్లా పార్టీ అధ్యక్షులు పిలుపునిచ్చారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి ప్రజల్లో ప్రభుత్వంపై మరింత విశ్వాసం పెరిగేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. రైతు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతుకు ఈ సీజన్‌లో కేజీకి రూ.4 ప్రోత్సాహక ధర అందించిందని, సిఎం నారా చంద్రబాబునాయుడు రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అలాగే ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌డే కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చే వినతుల పరిష్కార ప్రక్రియలో జిల్లా స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకత్వం మధ్య సమన్వయం మరింత బలోపేతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని సమావేశం తీర్మానించింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తల్లికి వందన పథకం ద్వారా సుమారు 67 లక్షల మంది విద్యార్థుల కోసం 42 లక్షల విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలో రూ.10,210 కోట్ల జమ చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్‌చౌదరి, మాజీ ఎమ్మెల్సీ బిఎన్ రాజసింహులు, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ త్యారాజన్, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీ ప్రసన్న, రాష్ట్ర పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, అనుబంధ విభాగాల ప్రతినిదులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరయ్యారు

## తోతాపురి మామిడి సరఫరా చేసిన రైతులు మరోసారి క్రాస్ చెక్

యాదమరి, జులై 29 ప్రభాతవార్త: యాదమరి మండల పరిధిలో ఏర్పాటు చేసిన ర్యాంపుల నుండి తోతాపురి మామిడి విక్రయాలు చేసిన మామిడి రైతులు మరోసారి కాటా బిల్లులు, ఆధార్ కార్డులు, బ్యాంకు ఖాతా కాపీలు సక్రమంగా అందజేశారా! లేదా! అనే విషయాలను రైతు సేవా కేంద్రం సిబ్బందిని కలిసి సరి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి దీప ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే మామిడి రైతులు ఈ మేరకు నమోదు వివరాలను తప్పనిసరిగా నమోదును సరి చూసుకోవాలని లేకుండా నిధులు బ్యాంకు ఖాతాలకు జమ అయ్యే అవకాశం వుండదని ఆమె పేర్కొన్నారు.

## పాళ్యం అడవిలో ఘనంగా గురుపౌర్ణిమ వేడుకలు



పెనుమూరు, జులై 29 ప్రభాతవార్త: పెనుమూరు సమీపంలోని పాళ్యం అడవిలో కొండపై వున్న పురాతన షిరిడీసాయి ఆలయంలో బుధవారం గురుపౌర్ణమి పుస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల బిజెపి అధ్యక్షులు గుప్తా వాసునాయుడు ఆధ్వర్యంలో ఆలయంలో బుధవారం నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు కన్నుల పండుగగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం శ్రీ వల్లభ, శ్రీ గురుపాదుకుల పూజ, రుద్రాభిషేకం, గరుపూజ, ధాన్యం, భజనలు, వేద పండితుల మంత్రోచ్చరణలతో ఆలయంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో స్వామిజీ మాట్లాడుతూ గురుతత్వం, సనాతన ధర్మంలో గురువు స్థానం, ఆధ్యాత్మిక జీవనం ఎంతో పవిత్రమైనదన్నారు. గురువు చూపిన మార్గంలో నడవడం ద్వారా జీవితానికి సార్థకత ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం పాళ్యం కొండపై వున్న పురాతన ఏకశిలాపై అఖండ జ్యోతి వెలిగించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో వందలాది భక్తులు పాల్గొన్నారు.

## బంగారు చైన్ చోరీ దొంగ అరెస్టు



బంగారుపాళ్యం, జులై 29 ప్రభాతవార్త: మండల కేంద్రం బంగారుపాళ్యం బస్టాండ్ సమీపంలో జరిగిన బంగారు చైను చోరీ ఘటనలో నిందితుడిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు బంగారుపాళ్యం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కత్తి శ్రీనివాసులు తెలిపారు. ఈ నెల 27వ తేదీన ముంగద మడుగు గ్రామంకు చెందిన ఎన్.పురుషోత్తం(19) బస్టాండ్ సమీపంలోని టిఫన్ దుకాణంలో చొరబడి బీరువాను పగులగొట్టాడు. అందులో వున్న బంగారు నల్లపూస దండను చోరీ చేశాడు. చోరీకి గురైన చైన్ విలువ సుమారు రూ.1.50 లక్షలు వుంటుందని ఇన్స్‌పెక్టర్ వెల్లడించారు. అరెస్టు చేసిన నిందితుడిని రిమాండ్ నిమిత్తం జిల్లా కోర్టుకు హాజరు పరచడం జరిగిందని ఆయన తెలిపారు.

## సాయిబాబు గుడిలో పౌర్ణమి వేడుకలు



బంగారుపాళ్యం, జులై 29 ప్రభాతవార్త: మండలంలోని పాలేరు గ్రామ సమీపం జాతీయ రహదారి ప్రక్కన వెలసిన శ్రీ షిరిడీ సాయిబాబు మందిరంలో బుధవారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాబా ఆలయంను ఏడు పుష్పాలతో సుందరంగా అలంకరణ చేపట్టారు. ఉదయం బాబా విగ్రహానికి పాలాభిషేక పూజలు, కాగడ హారతులు చేపట్టి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఆలయంలో టి.సత్యనారాయణ వ్రతంను అర్చకులు రవీంద్రనాధ్ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దంపతులు వ్రతంలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పాలేరు రామచంద్రారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## గురుపౌర్ణమి వేడుకలు

చిత్తూరురూరల్, జూలై 29 ప్రభాతవార్త: చిత్తూరుపట్టణం, గిరింపేట శ్రీసత్యసాయి సేవాసదన్ నందు గురుపౌర్ణమి సందర్భంగా ఉదయం మందిరంలో ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, అభిషేకం నిర్వహించినట్లు సత్యసాయి సేవాసదన్ జిల్లా అధ్యక్షులు ఎస్ మధుసూదనం తెలిపారు. అలాగే సాయంత్రం వేదపఠనం, పురవీధుల్లో పల్లకిసేవ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గజేంద్రరెడ్డి, చిన్నబ్బా, పాండురంగం, టిఆర్ శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## 10 రోజులుగా తాగునీరు లేక అవస్థలు

### – బంధార్లపల్లి అరుంధతివాడ ప్రజల ఆవేదన



పూతలపట్టు, జూలై 29 ప్రభాతవార్త: పూతలపట్టు మండలంలోని వడ్డేపల్లి పంచాయతీ బంధార్లపల్లి అరుంధతి వాడలో గత 10 రోజులుగా తాగు నీటి సరఫరా నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగడానికి మాత్రమే కాకుండా స్నానాలు చేసుకోవడానికి కూడా నీరు లేక కుటుంబాలు తీవ్ర అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. తాగునీటి కోసం గ్రామ సమీపంలోని చెరువుకు వెళ్లి స్నానాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, మరికొందరు ఆంజనేయస్వామి ఆలయం సమీపంలోని నీటి వనరుల నుంచి బిందెలతో నీరు తెచ్చుకుంటున్నామని తెలిపారు. ఈ సమస్యపై పంచాయతీ సెక్రటరీకి పలుమార్లు ఫోన్ చేసినా సమస్య పరిష్కరించకుండా, ఎందుకు పదేపదే ఫోన్ చేస్తున్నారు అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిన అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అరుంధతి వాడలో గత 40 సంవత్సరాలుగా నివాసం ఉంటూ, ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్నప్పటికీ ఎన్నికల సమయంలో మాత్రమే నాయకులు గ్రామానికి వచ్చి హామీలు ఇస్తారని, ఎన్నికలు ముగిసిన తర్వాత ఐదు సంవత్సరాల పాటు తమ సమస్యలను పట్టించుకునే వారు ఎవరూ ఉండరని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి బంధార్లపల్లి అరుంధతి వాడకు తాగునీటి సరఫరాను పునరుద్ధరించి, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను శాశ్వతంగా పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## వృద్ధురాలిని కాపాడిన 108 సిబ్బంది



పలమనేరు, జూలై 29 ప్రభాతవార్త: ప్రాణాపాయ స్థితిలో వున్న వృద్ధురాలిని 108 సిబ్బంది కాపాడిన సంఘటన బుధవారం జరిగింది. అత్యవసర చర్యలతో పాటు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించడంతో మృత్యు ద్వారం వరకు వెళ్ళి ప్రాణాలు దక్కించుకొని లేచి కూర్చుంది. అత్యధికంగా మద్యం సేవించడం వల్ల వృద్ధురాలికి పరిస్థితి ఏర్పడింది. పలమనేరు పట్టణంలోని పూల మార్కెట్ వద్ద పార్వ తమ్మ అనే వృద్ధురాలు అపస్మారక స్థితిలో పడివుండగా స్థానికులు గుర్తించారు. వెంటనే 108 వాహనానికి తెలియ జేయగా సిబ్బంది వెంకటేష్, మైకేల్ వెంటనే వచ్చి వృద్ధురాలికి ప్రథమ చికిత్స చేశారు. రక్తంలో చక్కెర నిల్వలు 28 పాయింట్లకు పడిపోవడంతో శ్వాస తీసుకోవడం కూడా కష్టమైంది. ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి సెలైన్ ద్వారా మందులు ఎక్కించడంతో కోలుకుంది. మద్యంకు బానిసైన ఈమె ఇప్పటికి ఎన్నోసార్లు ఈ విధంగా పడిపోవడం జరిగిందని స్థానికులు చెపుతున్నారు. ఏది ఏమైనా సకాలంలో సేవలు అందించి ఒక వృద్ధురాలి ప్రాణాలు కాపాడడం పట్ల 108 సిబ్బందిని పలువురు అభినందించారు.

## స్థానిక ఎన్నికలకు సంసిద్ధం కావాలి



రామకుప్పం, జూలై 29 ప్రభాతవార్త: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే కార్యకర్తలు నేతలు సంసిద్ధం కావాలని రాష్ట్ర గ్రంథాలయ డైరెక్టర్ మనస్వామి, జిల్లా నేత నారాయణ చారి, మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆంజనేయ రెడ్డి, ఆనంద రెడ్డి పేర్కొన్నారు. బుధ వారం స్థానిక సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఆవరణలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కూటమి అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి చైతన్యం తీసుకురావాలన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం పథకాలు సద్వినియోగం చేసుకునేలా వారి సమస్యలపై సత్వరమే పరిష్కరించే విధంగా చూడాలన్నారు. ప్రతి కార్యకర్త పార్టీకి అంకితభావంతో పనిచేసి పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కామరాజు నాయక్, ఎస్టీ సెల్ నరసింహులు, కృష్ణ నాయక్, శ్రీనివాసులు రెడ్డి, రామ్మూర్తి ,చిన్నకృష్ణ, చలపతి, గుర్రప్ప, వెంకట్రామ గౌడు, రవి రెడ్డి, విశ్వనాథ్, మహమ్మద్ రఫీ, జయశంకర్, బాలకృష్ణ, వెంకటాచలం, అవినాష్, బాలరాజు, సుబ్రి,ఆదిల్, మంజునాథ్, సురేష్, నియాజ్ తదితరులు పాల్గొన్నారు

## ఒంటరి ఏనుగు హల్ చల్

రామకుప్పం, జూలై 29 ప్రభాతవార్త: మండలంలోని నసియాల అటవీ సమీప ప్రాంతంలో ఒంటరి ఏనుగు హల్ చల్ చేసింది. మంగళవారం రాత్రి నాగు నాయక్ టెంకాయ చెట్లను నిలిచింది. అనంతరం మామిడి, పశుగ్రాసంలో తిన్నంత తిని తొక్కి చిందరవందర చేసింది. ఒంటరి ఏనుగు దాడులతో స్థానిక రైతులు భయాందోళనకు గురవుతున్నారు. పంటల పైకి ఏనుగుల కట్టడికి చర్యలు తీసుకోవాలని రైతన్నలు కోరుతున్నారు.

## ప్రజల నుంచి వినతులు స్వీకరించిన నారా భువనమ్మ



శాంతిపురం, జూలై 29 ప్రభాతవార్త: నాలుగు రోజుల కుప్పం పర్యటనలోభాగంగా బుధవారం సీఎం చంద్ర బాబు సతీమణి నారా భువనేశ్వరి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. మండలంలోని శివపురం వద్ద ఉన్న తమ స్వగృహంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు .సమస్యల పరిష్కారం కు తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమం ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం , పీకేఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బీఆర్ సురేశ్‌బాబు, సీఎంపీ ఎ శ్రీకాంత్ పాల్గొన్నారు.

## పరమహంస గురుకులంలో గురు పూర్ణిమ వేడుకలు



శాంతిపురం, జూలై 29 ప్రభాతవార్త: స్థానిక పరమహంస యోగానంద విద్యా లయలో బుధవారం గురుపూర్ణిమ వేడుక లను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులచే అక్షరాభ్యాసన కార్యక్రమాన్ని ,పెద్ద విద్యార్థులకు పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ ఆజాద్ హుస్సేన్, గురూజీ భక్తులు చక్రపాణి రెడ్డి, నారాయణ రెడ్డి, బాలాజీ ,సుబ్రహ్మణ్యం, చోక్కలింగం, కోదండప్ప, వెంకట్, కుమార్ ,సురేష్ రెడ్డి, రామకృష్ణప్ప, ప్రధాన పురోహితులు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా గురువుల గొప్పతనం గురించి వారు వివరించారు. విద్యార్థులకు అన్నప్రసాదం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎస్సీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు




కుప్పం, జూలై 29 ప్రభాతవార్త: రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ ను కుప్పం ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కుప్పం నియోజకవర్గంలో దళితుల సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆక్రమణలు ,దాడులు, బాధితులకు న్యాయం ఆలస్యం కావడం, అధికారుల నిర్లక్ష్యం దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలని వారు చైర్మన్ ను కోరారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ఎంఆర్పిఎస్ మాజీ అధ్యక్షుడు ప్రకాష్ ,కుప్పం నియోజకవర్గ సహ ఇన్చార్జ్ వెంకటేష్ ,నాయకులు గోవిందప్ప, జయప్ప, శంకర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

30CTR4:30CTR4.qxd 7/29/2026 11:27 PM Page 1



# ప్రతి కుటుంబంలో ఒకరిని పారిశ్రామిక వేత్తగా తీర్చిదిద్దమే లక్ష్యం

## కలెక్టర్ సుమిత్‌కుమార్



చిత్తూరు, జులై 29 ప్రభాతవార్త:
జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుండి అందిన దరఖాస్తులను పారదర్శకంగా త్వరితంగా పరిశీలించి అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా పారిశ్రామిక ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఏకగవాక్ష విధానం కింద గత మే నెలలో అందిన దరఖాస్తుల పరిష్కారం, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహానికి వివిధ రాయితీల మంజూరు వంటి అంశాలపై సమీక్షించారు. అలాగే ఎంఎస్‌ఎంఇలకు ప్రోత్సాహకాల మంజూరు జిల్లా స్థాయి కమిటీ ఆన్‌లైన్ ద్వారా అందిన క్లైములనఉ కల్కట్ర్ పరిశీలించారు. అలాగే ఈ సమావేశంలో గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై ప్రగతి, పెండింగ్‌లో వున్న పనులు, భవిష్యత్ కార్యాచరణను మండలాల వారీగా కలెక్టర్ అధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు. అలాగే జిల్లాలో అమలులో వున్న ప్రాజెక్టుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జిఎం సూరిబాబు, నాగసురేష్, ఎల్డీఎం షేక్ ఇనుల్, ట్రాన్స్‌కో ఎస్‌ఇ అమీర్‌బాబు, ఫుడ్ ప్రాసెసింగ్ ప్రతినిధి గోవర్ధన్ బాబీ, జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనాథ్, ఎస్సీ, ఎస్టీ ఛాంబర్ నేషనల్ చైర్మన్ డేవిడ్, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



రేణిగుంట, జూలై 29 ప్రభాతవార్త
రేణిగుంట విమానాశ్రయం సమీపం నందు ఉన్న ఏపీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను, హాస్టల్ రూములను, వంట గదులను, డైనింగ్ హాలును పరిశీలించారు. పాఠశాల విద్యార్థులతో మమేకమై వారి సమస్యలను తెలుసుకున్నారు. హాస్టల్లో విద్యార్థులకు చదువుకోవడానికి ఇబ్బంది కలగకుండా లైట్లు ఫ్యాన్లు మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. ముఖ్యంగా పాఠశాల, హాస్టల్ ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన శుభ్రమైన రుచికరమైన ఆహారం అందించాలన్నారు. విద్యార్థులకు విద్యాబోధన విషయంలో రాజీ పడకూడదని ఆదేశించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి, రేణిగుంట తహసిల్దార్ శ్రవణ్ కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ రవికాంత్, వైస్ ప్రిన్సిపాల్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ ఇతర అధికారులతో కలిసి పాత విమానాశ్రయం వెళ్లే మార్గంలోని ఈవీఎం గోడౌన్లను పరిశీలించారు.

## కాణిపాకం ఆలయంలో వ్యాసమహర్షికి ప్రత్యేకపూజలు



కాణిపాకం, జూలై 29 ప్రభాతవార్త:
వ్యాస మహర్షి జన్మదినం గురుపౌర్ణమి (వ్యాసపౌర్ణమి) సందర్భంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి ఆలయంలో బుధవారం వ్యాసమహర్షికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధాన ఆలయంలో అలంకార మండపంలో వ్యాసమహర్షి చిత్రపటాన్ని వుంచి వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ అర్చకులు ఘనంగా పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్, ధనుంజయ, అర్చకులు, వేదపండితులు పాల్గొనా న్నరు.

## ఎన్సీసీ కేడెట్లకు ధ్రువపత్రాల ప్రదానం

### - క్రమశిక్షణ, పట్టుదలే విజయనౌక



పాకాల, జూలై 29, ప్రభాతవార్త
పాకాల స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్సీసీ మొదటి బ్యాచ్ కేడెట్లు బి, సి సర్టిఫికేట్ పరీక్షల్లో ప్రతిభ చాటి తమ ప్రతిభను చాటుకున్నారు. ఉత్తీర్ణత సాధించిన కేడెట్లకు తిరుపతిలోని 29 ఆంధ్ర బెటాలియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఘనంగా ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎన్సీసీ సర్టిఫికేట్లు కేవలం కాగితాలు కావు అని, యువత భవిష్యత్తుకు బలమైన పునాదులని స్పష్టం చేశారు. విద్యార్థులకు ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు, అలాగే ప్రభుత్వ, సైనిక ఉద్యోగాల్లో ప్రాధాన్యత లభించడానికి ఈ సర్టిఫికేట్లు ఎంతగానో తోడ్పడతాయని ఉద్ఘాటించారు. సి సర్టిఫికేట్ 31 మంది కేడెట్లు హాజరు కాగా, 26 మంది ఘన విజయం సాధించారు. బి సర్టిఫికేట్: 4 గురు కేడెట్లు హాజరు కాగా, 3 గురు ఉత్తీర్ణులయ్యారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ విక్రమ్ ప్రసన్న, అడ్జుటెంట్ లెఫ్టినెంట్ కల్నల్ దివ్యా సింగ్, సుబేదార్ మేజర్ తేజేశ్వరరావు, పి.బి. రెడ్డి తదితరులు పాల్గొన్నారు. విజయం సాధించి కళాశాలకు పేరుప్రతిష్టలు తెచ్చిన కేడెట్లను ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుజాత, వైస్ ప్రిన్సిపాల్ రమేష్ కుమార్, ఎన్సీసీ అధికారి లెఫ్టినెంట్ ఈశ్వర్ బాబు ప్రత్యేకంగా అభినందించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## గోవిందరాజస్వామి పౌర్ణమి గరుడసేవ

తిరుపతి.జులై 29ప్రభాతవార్త:
తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలో బుధవారం పౌర్ణమి గరుడసేవ వైభవంగా జరిగింది. బుధవారం సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల నడుమ గోవిందరాజస్వామి తన ప్రియభక్తుడైన గరుడునిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు.

## ముదిరాజ్ యువసేన మహిళ విభాగం రాష్ట్రకమిటీలో పుష్పలత



తిరుపతి.జులై 29ప్రభాతవార్త:
తిరుపతికి చెందిన కరకంబాడి పుష్పలత ముదిరాజ్‌కు ముదిరాజ్ యువసేన రాష్ట్ర మహిళ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అవకాశం లభించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనారాయణ నియామక ఉత్తర్వులు జారీచేశారు.

## చంద్రన్నకు ఓట్లు ముఖ్యం కాదు.ప్రజా సంక్షేమమే ముఖ్యం

### మాజీ ఎంఎల్‌ఏ ఎస్‌సివి నాయుడు



తొట్టంబేడు,జులై 29 ప్రభాతవార్త
నేడు రాష్ట్రాన్ని పరిపాలించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఓట్లు ముఖ్యం కాదని ప్రజల సంక్షేమమేముఖ్య మని మాజీ శాసన సభ్యుడు ఎస్‌సివి నాయుడు అన్నారు. బుధవారం పార్టీ ఆదేశాల మేరకు ఆయన తొట్టంబేడు మండలంలోని గౌడ మాలలో ఇంటింటికి కూటమి ఫలాలు అనే కార్యక్రమాలకు ముఖ్యఅతిధిగా హాజరయ్యారు.ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్ర బాబు నాయుడు పాలనలో ఎప్పుడూ సంక్షేమం,అభివృద్ధియే అజెండాలుగా ఉంటాయన్నారు. కానీ గతంలో పరిపాలించిన ఘనులు శాంతి భద్రతలను గాలికి వదలిపెట్టారు.ఆరాచకాలకు ఒడిగట్టారు. 75 సంవత్సరాల వయస్సులో చంద్రబాబు నాయుడును54రోజులు జైల్లో పెట్టి పైశాచికానందాన్ని పొందారు. చంద్రబాబునాయుడు అధికారం చేపట్టి ఒరెండు సంవత్సరాలుపూర్తి అయినా కక్షసాధింపుకు పూనుకోలేదు. చంద్రబాబునాయుడే అనుకొని ఉంటే నేడు బయట వైకాపా నాయకుడుమాట్లాడేవాడా? అని గుర్తించాలని ఎస్‌సివి నాయుడుసూచించారు. నేడు తొట్టంబేడు మండలంలో వ్యవసాయం సజావుగా మూడు పంటలు పండించుకుంటున్నారంటే నాడు తెలుగుగంగ నుంచి తూములను చంద్రబాబునాయుడే మంజూరు చేసారన్నారు. నేడు చంద్రబాబు నాయుడు అన్ని వర్గాల ప్రజలను ఆకర్షిస్తూ సుపరిపాలన అందిస్తుంటే తగుదనమ్మా అంటూ వైకాపా నాయకులు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. ఆయనతోపాటు తెలుగుదేశం పార్టీకి చెందిన జి.భాస్కర్‌నాయుడు, అంజూరు సుధాకర్, కే.చంద్రశేఖర్ నాయుడు,జి.మోహన్‌నాయుడు, ప్రకాష్‌నాయుడు,మాధవరడ్డి, నారాయణయాదవ్, బబాలజి నాయుడు, సుబ్రమణ్యం,రాజానాయుడు, ఎస్‌సివికిరణ్, కయ్యూరి శివ, రిజ్వాన్, తదితరులుపాల్గొన్నారు.

## కాణిపాకంలో శాస్త్రసోక్తంగా సత్యనారాయణవ్రతం

కాణిపాకం, జూలై 29 ప్రభాతవార్త:
ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి ఆలయంలో బుధవారం సత్యనారాయణవ్రతంను శాస్త్రోక్తంగా అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రధాన ఆలయం అనుబంధ ఆలయమైన శ్రీశ్రీదేవి భూదేవి సయిత వరదరాజస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఈవ్రతాన్ని నిర్వహించారు. ఆలయ మండపంలో ఈవ్రతాన్ని అర్చకులు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ఘనంగా నిర్వహించారు. ఈమేరకు ఆలయంలో అర్చకులు స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయ మండపంలో వుంచి సత్యనారాయణవ్రతంను నిర్వహించారు.

### ఘనంగా పున్నమి గరుడసేవ

శ్రీశ్రీదేవి భూదేవి సయిత వరదరాజస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా బుధవారం రాత్రి పున్నమి గరుడసేవను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో సత్యనారాయణ వ్రతంను నిర్వహించగా రాత్రి గరుడసేవను నిర్వహించారు. ఆసందర భంగా అలంకరించిన స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను గరుడవాహనంపై వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## విద్యారంగంలో సంస్కరణలపై సిఎం ప్రత్యేక దృష్టి



కుప్పం, జూలై 29 ప్రభాతవార్త
విద్యారంగంలో సంస్కరణలపై సిఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారని సిఎం సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం గరిగచీనేపల్లి పాఠశాలను భువనమ్మ సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. ఈ ఏడాది లక్షకు పైబడి విద్యార్థులు ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరడం శుభపరిణామం అన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల కష్టాన్ని అర్థం చేసుకుని బాగా చదవాలన్నారు. ఆసక్తిఉన్న రంగంలో ప్రతిభ చాటాలన్నారు. సమయం వృధా చేయక క్రమశిక్షణతో మెలగాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. కార్యక్రమాల్లో కడ పి.డి. వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## 51 మంది జిఎంఎస్‌కెలకు పోస్టింగ్స్ కేటాయించిన ఎస్పీ తుషార్ డూడి



చిత్తూరు, జులై 29 ప్రభాతవార్త:
జిల్లాలో ఇప్పటికే వార్డు సచివాలయాలల్లో గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్న 51 మందిని ఎస్పీ తుషార్ డూడి వివిధ పోలీస్ స్టేషన్లకు అనుసంధానం చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ తుషార్ డూడి బుధవారం జిఎంఎస్‌కెలకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించి వారి విధులు, బాధ్యతలు, పోలీసుశాఖతో సమన్వయం, ప్రజలతో వ్యవహరించాల్సిన తీరు, మహిళలు, చిన్నారులకు సంబంధించిన అంశాల్లో అనుసరించాల్సిన విదానంపై స్పీ సమగ్రంగా దిశా నిర్ధేశం చేశారు. అనంతరం జిఎంఎస్‌కెలు ఇచ్చిన ఆప్షన్లు, ఆసక్తి, వివిధ నైపుణ్యాలను పరిగణనలోకి తీసుకుని ఎస్పీ వారికి వివిధ పోలీస్ స్టేషన్లకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్స్ ఎఎస్పీ షాను, ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ మురళీ, పోలీసు ప్రధాన కార్యాలయ ఎఓ నాగభూషణమ్మ, సంబంధిత ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆయన సేవలు ప్రతి ఉద్యోగికి స్ఫూర్తిదాయకం

### -తిరుమల డిపో మేనేజర్ ముని చంద్రయ్యకి వీడ్కోలు



తిరుమల,జులై 29ప్రభాతవార్తప్రతినిధి:
ఆర్టీసీలో కండక్టర్‌గా తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి, సూపర్‌వైజర్ పరీక్షలో ఉత్తీర్ణులై అంచెలంచెలుగా ఎదుగుతూ డిపో మేనేజర్ స్థాయికి టి.ముని చంద్రయ్య చేరుకోవడం ప్రతి ఉద్యోగికి స్ఫూర్తిదాయకమని వక్తలు కొనియాడారు. సుదీర్ఘమైన ఆయన సేవా కాలంలో వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తూ సంస్థ అభివృద్ధికి విశేష కృషి చేశారని, వారి అకుంఠిత దీక్ష, క్రమశిక్షణ, నిజాయితీ, సంస్థ పట్ల అంకితభావం ఆర్టీసీకి ఎంతో మేలు చేశాయని పలువురు పేర్కొన్నారు.తిరుమల డిపో మేనేజర్ టి.ముని చంద్రయ్య ఈనెల 31న పదవీ విరమణ చేస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం. జగదీష్ మాట్లాడుతూ ముని చంద్రయ్య సేవలను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఉద్యోగి నిబద్ధతతో పనిచేసి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షి ంచారు. అనంతరం జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయ సిబ్బంది, వివిధ డిపోల డిపో మేనేజర్లు, అధికారులు ,ఉద్యోగులు ముని చంద్రయ్య ని ఘనంగా సన్మానించి, వారి పదవీ విరమణ అనంతర జీవితం ఆనందమయం, ఆయురారోగ్యాలతో నిండి ఉండాలని ఆకాంక్షి స్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

## వైద్యసేవలో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు : కలెక్టర్



కార్వేటినగరం,జూలై 29 ప్రభాతవార్త:
వైద్యసేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ వైద్యసిబ్బందిని హెచ్చరించారు.బుధవారం కార్వేటినగరం పరిధిలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలు,ఔషదాల నిల్వ,పరిశరాల శుభ్రత,రికార్డులను పరిశీలించారు.రోగులతో మాట్లాడి వైద్యసేవలు ఎలా అందుతున్నాయో అని అడిగి తెలుసుకున్నారు. వైద్యసేవల్లో నిర్లక్ష్యం వుండకూడదని,రోగులకు అవసరమైన సేవలను అందించాలని వైద్యాధికారులకు సూచించారు.ఆసుపత్రి పరిశరప్రాంతాలలో నిరుపయోగంగా వున్న భవనాలను పరిశీలించారు. పాతభవానాన్ని కూడా పరిశీలించడం జరిగింది.ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు జరిగే విధంగా చర్యలు చేపట్టాలని డాక్టర్లకు సూచించారు.ఒపి శాతం పెంచాలని ఆదేశించారు.డయాలసిస్ పేషంట్లకు సక్రమంగా సేవలు అందించాలన్నారు.ఆసుపత్రి అభివృద్ధి కొరకు ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు.ఎంతమేర నిధులు అవసరము సిద్దం చేయాలని ఆదేశించారు.వచ్చిన పేషంట్లకు సురక్షతమైన తాగునీరు అందజేయాలని ఆదేశించారు.బోర్లను పరిశీలించారు.ఆసుపత్రి పరిశరాలు పరిశుభ్రంగా వుండే విధంగా చర్యలు చేపట్టాలని

## శ్రీ చెంగాళమ్మ దేవస్థానంలో చండీయాగం



సూళ్లూరుపేట, జూలై 29, ప్రభాతవార్త
తెలుగు తమిళ భక్తుల ఆరాధ్య దైవమైన శ్రీ చెంగాళ మాత పరమేశ్వరి దేవస్థానంలో గురు పౌర్ణమి పురస్కరించుకుని చండీ యాగాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవస్థాన ప్రాంగణంలోని యాగ మండపంలో ముందుగా గోమాతకు పూజలు చేసిన అనంతరం చండీయాగాన్ని వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రారంభించారు. ఉభయ దాతలు ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగా ప్రసాద్,కోమలి దంపతులు చండీయాగ పూజా కార్యక్రమంలో పాల్గొని శాస్త్రోకంగా యాగాన్ని నిర్వహించారు. ఉదయం ప్రారంభమైన చండీయాగం మధ్యాహ్నం పూర్ణాహుతితో ముగిసింది. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, శ్రీ పెంచలకోన ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ తానంకి నానాజీ, ఎఎంసి చైర్మన్ ఆకుతోట రమేష్, ఎఫ్ఎస్‌సిఎస్ చైర్మన్ ఏజీ కిషోర్, తిరుమూరు సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ పిట్ల సుబ్రమణ్యం, మాధవ నాయుడు, తదితరులు చండీయాగా పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవస్థాన సహాయ కమిషనర్ బి ప్రసన్నలక్ష్మి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

## సూళ్లూరుపేటలో గురు పౌర్ణమి వేడుకలు



సూళ్లూరుపేట, జూలై 29, ప్రభాతవార్త
సూళ్లూరుపేటలో గురు పౌర్ణమి పర్వదినా న్ని బుధవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కేఆర్ పాలెం, సాయి నగరాల్లోని శ్రీషిర్డీ సాయినాధుని మందిరాల్లోసాయినాధునికి ప్రత్యేక అలంకారాలు పూజలు చేశారు.దత్తాత్రేయ స్వామి వారికి 108 లీటర్ల పాలతో క్షీరాభిషేకాన్ని నిర్వహించారు. పార్కు వీధిలోని రామాలయంలో శ్రీ సత్యనారాయణ స్వామివ్రతాన్ని నిర్వహించారు. అలాగే శ్రీ నాగేశ్వర స్వామి దేవస్థానం, అభయ శంకర దేవస్థానంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణలు పూజలు చేశారు. శ్రీ నాగేశ్వరస్వామి దేవస్థానంలో చైర్మన్ తాటిపర్తి ఆదినారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు పేటేటి సునీల్ కుమార్ శర్మ, అభయ శంకర దేవస్థానంలో ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్ అర్చకులు రమణయ్య నేతృత్వంలో పూజలు జరిగాయి. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు.

## ఓటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

### - టీడీపీ మండల క్లస్టర్ ఇంచార్జి కూను శ్రీహరి



బాలాయపల్లి, జూలై 29, ప్రభాతవార్త
అభివృద్ధి సాధ్యమని మండల క్లస్టర్ ఇంచార్జి కూను శ్రీహరి తెలిపారు. మండలం లోని సంగవరం, పల్లిమిట్ట గ్రామంలో వెంకటగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ ఆదేశాల మేరకు ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కూటమి ప్రభుత్వంలో ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా టీడీపీ బాలాయపల్లి మండల క్లస్టర్ ఇంచార్జి కూను శ్రీహరి ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పార్టీ నాయకులు కార్యకర్తలకు అండగా ఉంటా

### - వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి



వెంకటగిరి, జూలై 29, ప్రభాతవార్త
పార్టీ నాయకులు కార్యకర్తలకు తన వంతు అండగా ఉంటానని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురు మల్లి రామ్ కుమార్ రెడ్డి మండలం లోని కందనాలపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ నాయకుడు గొడ్డటి రాజారెడ్డి మాతృమూర్తి గొడ్డటి ఆదెమ్మ ఇటీవల మృతి చెం దారు. ఈ సందర్భంగా గ్రామంలో బుధవారం నిర్వహించిన ఆదెమ్మ ఉత్తరక్రియల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ విచిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు నాయకులకు పార్టీతో పాటు కాను కూడా కూడా అండగా ఉంటానని తెలిపారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చింతల శ్రీనివాసులు రెడ్డి, ప్రసాద్ రెడ్డి, కే శ్రీనివాసులు రెడ్డి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో పోలీసులు దౌర్జన్యాన్ని నిరసిస్తూ సిపిఎం నాయకులు ధర్నా



వెంకటగిరి, జూలై 29 ప్రభాతవార్త
ఢిల్లీలో సిపిఎం పార్టీ కార్యాలయంలో పోలీసులు ప్రవేశించి నాయకులు పై దౌర్జన్యం చేయడం బాధాకరమని సిపిఎం నియోజకవర్గ కన్వీనర్ వడ్డిపల్లి చంగయ్య తెలిపారు. వెంకటగిరి తాసిల్దార్ కార్యాలయం వద్ద ఢిల్లీలో జరిగిన ఘటనపై సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పోలీసులు పార్టీ కార్యాలయంలో ప్రవేశించి దౌర్జన్యం చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. రోజురోజుకీ పోలీసుల దౌర్జన్యకాండ ఎక్కువ అవుతున్నట్లు విమర్శించారు. పెట్లూరు గ్రామంలో దళితులు వేసుకున్న గుడిసెలకు విద్యుత్ శాఖ అధికారులు కరెంటు కట్ చేయడం బాధాకరమన్నారు. విద్యుత్ శాఖ ఏఈ పై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సీతారాం ఏచూరి నగర్‌లో ఎప్పటినుండో పలువురు గుడిసెలు వేసుకుని కరెంటు తీసుకుని నివాసం ఉంటున్నట్లు తెలిపారు. విద్యుత్ శాఖ సిబ్బంది చర్యలను ఖండిస్తున్నట్లు చెప్పారు. తాసిల్దార్ శిరీష కు విద్యుత్ శాఖ సిబ్బందిపై ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు



వెంకటగిరి, జూలై 29, ప్రభాతవార్త
వెంకటగిరి పట్టణంలోని సాయిబాబా మందిరాల్లో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. సాయిబాబా ఆలయాలను పరిమళ పుష్పాలతో అలంకరించారు. భక్తులు సాయిబాబాకు పూజలు నిర్వహించారు. ఉదయం నుండి సాయి బాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఏఎంసీ చైర్మన్ పొనుగోటి విశ్వనాథ సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం గురువారం రోజు సాయిబాబా సూచనల మేరకు పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ తిరుమల శెట్టి వల్లభ దాస్ తెలిపారు. సాయి నామ సంకీర్తనలు, పట్టణ పురవీధుల్లో సాయిబాబా ఊరేగింపు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుమ్మరమెట్ట వద్ద ఉన్న సాయిబాబా ఆశ్రమంలో భక్తులకు అన్నదానం చేశారు. సాయిబాబా వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## వినూత్న రీతిలో దస్తా లేఖరుల నిరసన

వెంకటగిరి, జూలై 29, ప్రభాతవార్త
వినూత్న రీతిలో దస్తా లేఖకులో గురు పౌర్ణమి సందర్భంగా సాయిబాబాకు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో నెంబర్ 396 వల్ల దస్తావేజు లేఖర్లు డిటిపి ఆపరేటర్లు సహాయకులు స్టాంప్ వండర్స్ నష్ట పోయి, వారి జీవన భృతికి ఆటంకం కలిగి అందరూ రోడ్డు మీద పడ్డారన్నారు. కనుక ఈ జీవో నెంబర్ 396ను రద్దు పరచుటకు ఈ నెల 20వ తారీకు నుండి 31వ తారీకు దాకా రాష్ట్ర డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ సంఘం పిలుపుమేరకు పెన్డౌన్ కార్యక్రమమును వెంకటగిరి నందు కూడా ఈనెల 20వ తారీకు నుండి 31 వ తారీకు వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోంది. కానీ గవర్నమెంట్ వారు ఇప్పటివరకు ఈ జీవోను రద్దు పరచుటకు అంగీకరించుటలేదన్నారు. పదో రోజు వెంకటగిరిలోని సోమసానిగుంట ఏరియాలోని శ్రీ షిరిడి సాయిబాబా గుడి నందు సాయిబాబా వారికి గవర్నమెంట్ వారు జీవో నెంబర్ 396 ను రద్దు పరచుటకు వెంకటగిరి దస్తావేజర్లు డిటిపి ఆపరేటర్లు సహాయకులు స్టాంపు వెండర్స్ సాయినాధునికి అర్జీ ఇచ్చి ప్రజా పరిపాలికులకు, ప్రభుత్వం వారికి ఈ సాయినాధుని ద్వారా తెలియపరిచేటట్లు ఈ జీవో నెంబర్ 396 రద్దు కావాలని ప్రార్థించారు.

30CTR6:30CTR6.qxd 7/29/2026 11:29 PM Page 1



# హైవే రోడ్డు వేసారు.. ప్రహరీ కొట్టేశారు.. రేకులతో గోడ?

## బాలికల భద్రతను గాలికి వదిలేసారు..

తొట్టంబేడు జూలై 29 ప్రభాత వార్త

జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచి శ్రీకాళహస్తిలోని కాసాగార్డెన్‌లోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకులంలో చేరుతారు. ఇక్కడ విద్యతో పాటు విద్యార్థుల రక్షణకు చక్కటి భద్రత ఉండేది. అయితే రోజు రోజుకు ఈ నమ్మకం తల్లిదండ్రుల్లో సడులుతుంది. శ్రీకాళహస్తి కాసా గార్డెన్ సమీపంలోని ఏపీ ఎస్ డబ్ల్యు ఆర్ డా. బి. ఆర్ అంబేద్కర్ బాలికల గురుకులం 6 లైన్ల జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఈ గురుకులానికి పటిష్టమైన ప్రహరీ గోడ ఉండేది. ప్రభుత్వ నాయుడుపేట పూతలపట్టు 6 లైన్ల జాతీయ రహదారి నిర్మించారు. రవాణా సౌకర్యాల కల్పన మంచిదే కానీ ఆ ముసుగులో ఉన్న సదుపాయాల్ని అదీ బాలికల సంక్షేమ హాస్టల్ భద్రతను కూలగొట్టడం తరువాత పట్టించుకోక పోవటంపై విమర్శలు చోటు చేసుకున్నాయి. రోడ్డు పనుల పేరుతో గురుకుల భూమిని లాక్కున్నారు. రోడ్డు నిర్మాణ బాధ్యత మెగా ఇంజనీరింగ్ కంపెనీకి అప్పగించారు. ప్రభుత్వం భూసేకరణలో పరిహారం చెల్లించింది. కొత్త ప్రహరీ కట్టడానికి డబ్బులు చేతికొచ్చాయి. సాంఘీక సంక్షేమ శాఖ విద్యార్థుల భద్రత దృష్ట్యా గోడను నిర్మించాల్సి ఉంది. కానీ నిధులన్నా ఎందుకో ఆ శాఖ బాలికల భద్రతను గాలికి వదలిపెట్టారు. కొంత భాగం గోడ కట్టారు. మిగిలిన చోట రేకులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. అదే ఇప్పుడు "భద్రత" అంటున్నారు. 6 లైన్ల హైవే. రోజుకు వేల వాహనాలు. రాత్రివేళల్లో ఎవరు వచ్చినా ఎవరికి తెలుస్తుంది? ఇంత రద్దీ రోడ్డు, ఇంత పెద్ద కళాశాల... ఇక్కడ ఏం జరిగినా అధికారులకు పట్టదా? అని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. "మా పిల్లలను చదువుకోసం పంపాము. కానీ భద్రత లేకుండా ఎలా నమ్మి వదలాలి?" అని కన్నీరు పెట్టుకుంటున్నారు. పరిహారం వచ్చిన తర్వాత కూడా పూర్తి కాంపౌండ్ ఎందుకు కట్టలేదు? ఆ నిధులు ఏమయ్యాయి?



### జిల్లా అధికారుల మౌన మేల?

ఈ ప్రాంతాల్లో పలుమార్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పి పరిశీలనలు జరిపారు. రోడ్డుపక్కన సంక్షేమ కళాశాల, హాస్టల్ ఉందనే విషయం తెలియని కాదు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించినపుడు సాంఘీక సంక్షేమ శాఖ ఎందుకు కళ్లుమూసుకుందనేది ఎవరికి అంతుపట్టని ప్రశ్న, రోడ్డు పక్కల ఎన్నో సంవత్సరాలుగా ఉన్న ప్రహరీ గోడను పడగొట్టినపుడు మళ్ళీ నిర్మించాలనే యోచన లేకపోవటం శోచనీయమని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇక్కడ ప్రధాన గేటు నుంచి అనుమతి లేని వారిని అనుమతించరు. వారంలో ఒక రోజు వచ్చే తల్లిదండ్రులకు సవాలక్ష నిబంధనలతో నిలబెడతారు. అయితే ఓ వైపు ప్రహరీ గోడను తోసేస్తే తరువాత పట్టించుకోక పోవటం అధికారులు నిర్లక్ష్యానికి నిదర్శనం ఇప్పటికైనా అధికారులు వేలాది మంది ఆడపిల్లల చదివే విద్యాలయంలో భద్రతను పట్టించుకోక పోవటం దారుణం. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించాలని కోరుతున్నారు. ఈ సమస్యపై ప్రభాతవార్త గురుకులం ప్రిన్సిపల్ మాధవిని వివరణకోరగా ఇక్కడ సుమారు 70 మీటర్ల గోడ కట్టాల్సి ఉందని త్వరలోనే ప్రారంభించటానికి ఇంజనీర్లు పరిశీలించారని తెలిపారు.

## సౌత్ కోస్ట్ రైల్వే కొత్త జోన్ మజ్దూర్ యూనియన్ కొత్త కార్యవర్గం




రేణిగుంట జూలై 29 ప్రభాతవార్త

భారత రైల్వే శాఖ నూతనంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటుచేసిన క్రమంలో మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రెటరీ శంకర్రావు, జోనల్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ నాయకత్వంలో సౌత్ కోస్ట్ రైల్వే మజ్దూర్ యూనియన్ వర్క్ షాప్ డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వర్క్ షాప్ డివిజన్ ప్రెసిడెంట్గా కాళహస్తి బాబు, డివిజనల్ సెక్రటరీగా నాగేశ్వరరావు ఎంపిక య్యారు. గ్యారేజ్ రిపేర్ షాప్ తిరుపతి బ్రాంచ్ అసిస్టెంట్ డివిజనల్ సెక్రటరీలుగా సదాశివరెడ్డి, ముని రాధయ్య, ముని కుమార్, జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యునిగా హెన్రీ పాల్ ఏకగ్రీవమయ్యారు. సిఆర్ఎస్ తిరుపతి బ్రాంచ్ ఛైర్మన్ సదాశివరెడ్డి అధ్యక్షతన ట్రెజరర్ ముని కుమార్ కార్యవర్గ సభ్యులు చంద్ర నాయక్, గాండీవం, దిలీప్ కుమార్, సిసిఎస్ డెలిగేట్స్ నరేంద్ర కుమార్, అరుణ్, క్యాంటీన్ డైరెక్టర్ బాబు, బిసి సభ్యులు, యూత్ సభ్యులు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు, మహిళా నాయకులు, యాక్టింగ్ యంగ్ వర్కర్స్ ముఖ్య అతిథులుగా వచ్చిన ఓబీసీ అసోసియేషన్ సెక్రటరీ వెంకటరమణ, ఛైర్మన్ మునయ్య, ట్రెజరర్ సుధీర్, కార్యవర్గ సభ్యులు, ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ నాయకులు ట్రెజరర్ విజయ్, అసిస్టెంట్ డివిజన్ సెక్రెటరీ రమేష్ బాబు కార్యవర్గ సభ్యులు నూతనంగా ఎంపికైన నాయకులకు అభినందనలు తెలియజేసి ఘనంగా సత్కరించారు.

## దేవాదాయ భూముల్లో అక్రమంగా ప్రవేశిస్తే చర్యలు తప్పవు...



రేణిగుంట, జూలై 29 ప్రభాతవార్త

దేవాదాయ శాఖకు చెందిన భూముల్లో అనధికారికంగా ఎవరైనా ప్రవేశిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణ, కార్యనిర్వహణాధికారి రామకృష్ణారెడ్డి సంయుక్తంగా హెచ్చరించారు. రేణిగుంట మండలం తూకివాకం గ్రామ లెక్క దాఖలు సర్వేనెంబర్ 6 దేవాదాయ శాఖకు పరిధిలో శ్రీ కందాల గోవిందా చార్యులు ట్రస్ట్ కు సంబంధించిన 29 ఎకరాల 85 సెంట్ల భూమి నందు ఎండోమెంట్ అధికారులు బుధవారం సూచిక బోర్డు నాటారు. భూమికి సంబంధించి హైకోర్టులో కేసు ఉందని ఎండోమెంట్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం కేసు విచారణలో ఉన్నప్పటికీ కొంతమంది ఆక్రమణదారులు భూమిలోకి ప్రవేశించి చదును చేస్తున్నట్లు తెలియడంతో న్యాయస్థానం పరిధిలో ఉన్న దేవాదాయ భూములను కాపాడేందుకు శాఖ పరమైన చర్యల్లో భాగంగా సూచిక బోర్డు నాటినట్లు తెలిపారు. అనుమతి లేకుండా హైకోర్టులో కేసు నడుస్తున్న భూమిలో ఎవరు ప్రవేశించకూడదన్నారు..

## గరుడ వాహనంపై కల్యాణ వెంకన్న



చంద్రగిరి, జూలై 29 ప్రభాతవార్త:

శ్రీ మహావిష్ణువు నిత్య వాహనమైన గరుడ వాహనంపై బుధవారం కల్యాణ వెంకన్న ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని గరుడవాహన సేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా రాత్రి 7 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తిని మండపానికి తీసుకువచ్చి వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి గరుడవాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ పున్నమి వెన్నెల వెలుగులో దేవదేవుడు ఆలయ తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను ఆశీర్వదించారు. ఈ వాహనసేవలో జెఇఒ శరత్, స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం. గోపీనాద్, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ద్వారక మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, ఆలయ ప్రధాన అర్చకులు బాలాజీ రంగకుమార్, నారాయణాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంఎల్‌ఏపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించడం

### టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి



రామచంద్రాపురం, జూలై 29 ప్రభాతవార్త:

ఎంఎల్ఏ పులివర్తి నానిపై వైసిపి చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తప్పుడు ఆరోపణలు చేస్తే సహించబోమని టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి అన్నారు. బుధవారం రామ చంద్రాపురం టిడిపి కార్యాలయంలో మృతుడు సుబ్రమణ్యం బంధు వులతో కలసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలచెరువు పేటలో కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడిన సంజీవి సుబ్రమణ్యం తెలుగుదేశం పార్టీ సానుభూతి పరుడని అన్నారు. మృతుడు సుబ్రమణ్యం, జనసేన మండల అధ్యక్షుడు సంజీవి హరి ఇంటి వద్ద ఏర్పడిన స్వల్ప ఘర్షణలో సంజీవి హరి పోలీసులకు ఫిర్యాదు చేయడం, పోలీసులు సుబ్రమణ్యం కుటుంబ సభ్యులను పిలిచి మందలించడం జరిగిందన్నారు. దీనిపై మోహిత్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా ఎంఎల్‌ఏపై అసత్య ఆరోపణలు చేయడం భావ్యం కాదన్నారు. పూర్తిగా సమాచారం తెలుసుకుని ఆరోపణలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాదవయ్య, గిరిధర్ యాదవ్, రవి, మృతుని బంధువులు పాల్గొన్నారు.

## ఆడికృత్తిక మహోత్సవాల గోడపత్రికల ఆవిష్కరణ



శ్రీకాళహస్తి, జూలై 29 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలోనూ, కుమారస్వామి కొండపై ఆగస్టు 1 నుంచి ప్రారంభమయ్యే ఆడికృత్తిక మహోత్సవాల గోడపత్రికలను బుధవారం శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆలయం బయట నిర్వహించే ఉత్స వాల్లో మరో ప్రధానమైనది జనంతో ముడిపడి ఉన్న ఉత్సవం ఆడికృత్తిక మొదటి నాలుగురోజులు ఆలయం లోని చెంగల్వ రాయస్వామి ఆలయం లోనూ, తరువాత కుమారస్వామి కొండపై వెలసిన సుబ్రమణ్యం స్వామి ఆలయంలో నిర్వహించే ఉత్సవాల్లో విశేష సంఖ్యలోభక్తులు హాజరౌతారు. గురుదక్షణామూర్తి ఆలయం వద్ద గోడపత్రికలను ఆవిష్కరించారు. చైర్మెన్ కొట్టెసాయిప్రసాద్ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలను ఆలయ ఇఒ బికె వెంకటేశులు నిర్వహించారు. గోడపత్రికలను ఎంఎల్ఏ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో చైర్మెన్‌తో పాటు బోర్డు సభ్యులు వాకచర్ల గుర్రప్పశెట్టి గోపినాథ్, లక్షమ్మ, తెలుగుదేశం నాయకులు పట్టణ పార్టీ అధ్యక్షులు జి. విజయకుమార్‌నాయుడు, కాసరం రమేష్, బాలు డిల్లిబాబు, నెమళ్లూరు బుజ్జి, నాగమల్లి దుర్గా ప్రసాద్, సుబ్బయ్య, ఎంఎస్‌రెడ్డి పాల్గొన్నారు.

## డీఎస్సీ పేరుతో రాజకీయ కుట్రే వైసీపీది

### న తిరుపతి పార్లమెంట్ టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చిటేటి పృథ్వీరాజ్



సత్యవేడు, జూలై 29 ప్రభాతవార్త:

డీఎస్సీ పేరుతో రాజకీయ కుట్రే వైసీపీదేనని సత్యవేడు మండలానికి చెందిన టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి తిరుపతి పార్లమెంట్ చిటేటి పృథ్వీరాజ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా డీఎస్సీపై వైసీపీ, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా రాజకీయ డ్రామాలేనని, ప్రజలను తప్పుదోవ పెట్టించి ప్రయత్నమని టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చిటేటి పృథ్వీరాజ్ విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 150 రోజుల్లోనే ఎంతో పారదర్శకంగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసి నియామకాలను పూర్తి చేసిందన్నారు. అదే విధంగా వైసీపీ హయాంలో 150కిపైగా కోర్టు కేసుల వల్ల నియామకాలు ఆలస్యమయ్యాయని, వాటిని కూటమి ప్రభుత్వం పరిష్కరించి ముందుకు తీసుకెళ్లిందని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం ఉద్యోగాల పేరుతో యువతను మోసం చేసిందని, జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను నిరాశపరిచిందని విమర్శించారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో జరుగుతున్న విద్యా సంస్కరణలను ఓర్వలేక వైసీపీ నేతలు అమలాపురంలో నిరసనల పేరుతో డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. డీఎస్సీ పేరుతో వైసీపీ చేపడుతున్న ర్యాలీలు నిరుద్యోగ యువతను మరోసారి మభ్యపెట్టే రాజకీయ నాటకమని తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఎన్నికలకు ముందు ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ అంటూ గొప్పలు చెప్పిన జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఐదేళ్ళ పాటు నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడిందని, ఉద్యోగాల కోసం ఎదురు చూసిన వేలాది మంది యువతను అప్పులు చేసి చదివించిన తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేసిందన్నారు. మాటలు కాదు, చేతల్లో చూపిస్తున్న ప్రభుత్వం కూటమిదే, యువత భవిష్యత్ కోసం నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఐదేళ్లు ఎందుకు మెగా డీఎస్సీ నిర్వహించలేదో వైసీపీ నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## విద్యార్థులకు విద్యా సామగ్రి వితరణ

విజయపురం, జూలై 29 ప్రభాతవార్త:



మండలంలోని గంగమాంబపురం జడ్పీ హైస్కూలు విద్యార్థులకు దాతల ఆర్థిక సాయంతో అందించిన విద్యా సామగ్రిని విశ్రాంత ఉపాధ్యాయుడు చంద్రయ్య అందించారు. ఈ సందర్భంగా పేద విద్యార్థుల చదువుల కోసం దాతలు ముందుకు వచ్చి విద్యా సామగ్రిని అందించడం ప్రశంసనీయమని చంద్రయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శివయ్యసేవలో సిని గాయని

శ్రీకాళహస్తి, జూలై 29 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరుని సేవలో బుధవారం ప్రముఖ సినీ గాయని గీతామాధురి కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాలతో బోర్డు సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి, ఎపిఆర్ఓ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు. ఆలయంలోని స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనంను బోర్డు సభ్యుడు ఏర్పాటు చేసారు. దర్శనానంతరం వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించి స్వామి అమ్మవార్ల చిత్రపటాలను తీర్థ ప్రసాదాలను గుర్రప్పశెట్టి అందించారు.

## వాడ వాడల్లో గురు పౌర్ణమి పూజలు

తొట్టంబేడు, జూలై 29 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోని వాడ వాడల్లో బుధవారం గురుపౌర్ణమి సందర్భంగా సాయినాథునికి పూజలు, అభిషేకాలు, అలంకారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో అతిధులు హాజరై దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. ఎల్ఐసి కాలనీ సమీపంలోని షిరిడి సాయినాధుని సన్నిధిలో మంగళవారం రాత్రి నుంచి పూజలు, ఆరాధనలు, సాయినాధుని చరిత్ర పఠనం నిర్వహించారు. భక్తులు సాయిబాబా చాలీసాను పఠించారు. వేకువ సామును బాబా పాలరాతి విగ్రహానికి హారతులిచ్చారు. అభిషేకించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు అతిధులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. శ్రీకాళహస్తి డివైయస్‌పి నరసింహామూర్తి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా డివైయస్‌పికి పలు సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరిసరాల్లో దొంగతనాలు అధికంగా ఉందన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరు ఇళ్ళ ముందు, షాపుల ముందు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాలను త్వరగా ఛేదించవచ్చునని వివరించారు ఆలయ కమిటి కార్యదర్శి జగదీష్, లీగల్ అడ్వయిజర్ గుమళ్ళ రాజేశ్వరరావు, బాబా ఫరీద్, నాగేశ్వరరావులు తదితరులు పాల్గొన్నారు. కాగా పట్టణంలోని కర్నాల వీధిలో ఉన్న బాబా గుడిలో భక్తులు పొట్టెత్తారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఆలయాన్ని నిర్వాహకులు జూలుగంటి గోపి చక్కగా ముస్తాబు చేసారు. పట్టణంలోని భక్తులు అధికంగా పాల్గొని పూజలు జరుపుకున్నారు. ఆలయాల్లో భక్తులు ప్రసాదాలు వితరణ చేసారు.

## బొప్పరాజుపల్లిలో భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

రామచంద్రాపురం, జూలై 29 ప్రభాతవార్త:



బొప్పరాజు పల్లిలోని శ్రీషిరిడీ సాయిబాబా ఆలయంలో బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలు, విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. స్వామి వారికి సుగంధపరిమళ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి, నూతన వస్త్రాలు ధరింపజేశారు. అనంతరం గ్రామానికి చెందిన కారె సుబ్రమణ్యం కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా తెప్పించిన 500 కిలోల పుష్పాలతో పుష్పయాగం నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

# తిరుపతి డివిజన్

## వైసిపి డైవర్షన్ రాజకీయాలు జనం నమ్మరు

### -టిడిపి ఇన్‌ఛార్జి జెబి



తిరుపతి, జులై 29ప్రభాతవార్త:

డిఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులు భర్తీచేసిన తరువాత ,ఇప్పుడు అ అంశాన్ని తీసుకువచ్చి వైసిపి నేతలు డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారని టిడిపి తిరుపతి ఇన్‌ఛార్జి జెబి శ్రీనివాస్ మండిపడ్డారు. ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వేలాది మందిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, అనవసర రాద్ధాంతం చేస్తున్న వైసిపికి టిడిపి పక్కా ఆధారాలతో బహిరంగ చర్చకు రావాలని కూటమి నేతలు ఆహ్వానించినా పత్తాలేకపోయారని ఎద్దేవాచేశారు. మెగా డీఎస్సీపై కోర్టు మొట్టికాయలు వేసినా సిగ్గు లేకుండా ఆరోపణలు చేస్తున్నారన్నారు. సరైన ఆధారాలతో వస్తే మేము చర్చకు సిద్ధంగా ఉన్నామని జెబి సవాల్ విసిరారు. బుధవారం సాయంత్రం తిరుపతిలోని పార్లమెంట్ కార్యాలయంలో అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, టిడిపి నేతలు మునిరామయ్య, యశ్వంత్‌రెడ్డి, సరోజమ్మతో కలసి జెబి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. గత ఐదేళ్లలో జగన్ మోహన్ రెడ్డి చాలా పాపాలు చేశారని, ఇలా అబద్ధపు ప్రచారం లో భాగంగానే 11 సీట్లకు వైసిపి పరిమితమైందని విమర్శించారు. మళ్ళీ ఇదేరీతిలో నోరు పారేసుకుంటే మరోసారి ఒకటి కూడా వస్తుందో రాదోనని అన్నారు. తిరుపతిలో భూమన భూ బాగోతం బయటపడ్డాకా భయటకు రాకుండా ఒదార్పులు చేసుకుంటున్నారని విమర్శించారు. నిన్న జరిగిన మెగా డీఎస్సీ ర్యాలీకి పక్క నియోజకవర్గం నుంచి రోజా అక్కను తెచ్చుకున్నారని, ర్యాలీలో పాల్గొన్న వారంతా గంజాయి బ్యాచ్అని ఘాటుగా స్పందించారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని ఆరోపణలు మాని అభివృద్ధి పై సలహాలు ఇవ్వండని అన్నారు.

## పార్టీని బలోపేతందిశగా పనిచేయాలి

### -సుద్దాల రాజుయాదవ్‌కు సిఎం చంద్రబాబు నిర్దేశం



తిరుమల, జులై 29ప్రభాతవార్తప్రతినిధి:

తిరుపతి నియోజకవర్గంలో తిరుమల ప్రాంతంలో పవిత్రతను కాపాడుతూ టిడిపిని బరింత బలోపేతం చేయాలని, ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి అవగాహన కల్పించాలని సిఎం చంద్రబాబునాయుడు సూచించారు. ఇదే స్ఫూర్తితో బాగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పార్టీని గెలిపించుకోవాలన్నారు. బుధవారం అమరావతి ఉండవల్లిలోని సిఎం చంద్రబాబునాయుడును నివాసంలో తిరుమల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సుద్దాల రాజు యాదవ్, తెలుగు యువత కార్యదర్శి విశ్వనాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తిరుమల శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## డాక్టర్ నారాయణరెడ్డి సాహిత్య సవ్యసాచి

### -రాయలసీమ రంగస్థలి

తిరుపతి. జులై 29ప్రభాతవార్త:



తెలుగు సాహిత్యాన్ని విశ్వవ్యాప్తంగా చాటిచెప్పిన మహాకవి, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ సి. నారాయణరెడ్డి సాహిత్య సవ్యసాచి అని రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్ రెడ్డి కొనియాడారు. ఆయన జయంతి వేడుకలను తిరుపతిలో రాయలసీమ రంగస్థలి కళాకారులు ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రధాన తపాలా కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ సి. నారాయణరెడ్డి తెలుగు సాహిత్యాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన మహోన్నత సాహితీవేత్త అని అన్నారు. కవిత్వం, గేయరచన, పరిశోధన, విమర్శ, నవల, వ్యాస రచన వంటి అనేక సాహిత్య ప్రక్రియల్లో ఆయన అసాధారణ ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. "విశ్వంభర" వంటి మహాకావ్యంతో జ్ఞానపీఠ పురస్కారాన్ని అందుకుని తెలుగు భాషకు అపూర్వమైన గౌరవాన్ని తీసుకువచ్చారని చెప్పారు. వేలాది సినీ గీతాలతో ప్రజల హృదయాలను గెలుచుకున్న ఆయన రచనలు నేటికీ సాహిత్యాభిమానులకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి కళాకారులు కే ఎన్ రాజా, డాక్టర్ విద్వాన్ కస్పా పద్మనాభం, మెట్టపల్లి బ్రహ్మానంద రెడ్డి, ఆర్ఎంఎస్ భాస్కర్, కాంతారావు, పెరియార్ స్వామి రామ్ కుమార్, పవన్ చౌదరి, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, లోక ప్రభాకర్ నాయుడు, పోలే జనార్దన్ రెడ్డి, చంగల్ రాయులు తదితరులు పాల్గొన్నారు.

## వేడుకగా గురు పౌర్ణమి పూజలు

తిరుపతి. జులై 29ప్రభాతవార్త:



గురు పౌర్ణమి సందర్భంగా తిరుపతి కొంకా వీధిలో వెలసిన శిరిడి సాయిబాబా ఆలయంలో బిజెపిసీనియర్ నాయకుడు గుండాల గోపీనాథ్ రెడ్డి బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికి, సాయిబాబా దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అనంతరం గుండాల గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ గురు పౌర్ణమి భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యున్నత స్థానం కల్పించే పవిత్రమైన పర్వదినమని అన్నారు. మన జీవితానికి దిశానిర్దేశం చేసి, అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞాన వెలుగులు ప్రసాదించే గురువులను ఈ రోజున స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. శిరిడి సాయిబాబా బోధించిన "శ్రద్ధా – సబూరి" అనే సందేశం నేటి సమాజానికి ఎంతో అవసరమని, ప్రేమ, సేవ, సహనం, మానవత్వం అనే విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు.

## విద్యార్థినులకు కెరీర్ అవగాహన



తిరుపతి. జులై 29ప్రభాతవార్త:

రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ,పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం తిరుపతిలోని ఎంబీఏ కళాశాలలో విద్యార్థినులకు కెరీర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శిక్షణ పొందిన విద్యార్థినుల నుండి ఫీడ్‌బ్యాక్ సేకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఉపాధి నైపుణ్య అభివృద్ధి అధికారి పద్మజ హాజరయ్యారు. ప్రత్యేక అతిథిగా ఆచార్య శోభారాణి ప్రసంగించారు. యువతలో నైపుణ్యాభివృద్ధి, కెరీర్ ప్రణాళిక మరియు ఉద్యోగ అవకాశాలపై అవగాహన పెంపొందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ చివరి సంవత్సరం , పీజీ విద్యార్థుల కోసం కెరీర్ అవేర్‌నెస్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఆర్. లోకనాథం విలువైన సూచనలు అందించారు.

## అర్జున తపస్సుతో ఉత్సవాలకు ఉత్సాహం

తిరుపతి రూరల్, జులై 29ప్రభాతవార్త:



మండలంలోని దుర్గసముద్రం గ్రామంలో వెలసిన శ్రీ శ్రీ ద్రౌపది సమేత ధర్మరాజ స్వామి దేవస్థానంలో జరుగుతున్న 44వ మహాభారత ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం అర్జున తపస్సు ఘట్టం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా మిట్టపల్లి జయసింహ రెడ్డి సేవలందించారు. అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించగా, భక్తులు పెద్ద ఎత్తున హాజరై దర్శించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. మహాభారత ఉత్సవాల నేపథ్యంలో ప్రతిరోజూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మిట్టపల్లి ప్రసాద్ రెడ్డి గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.